రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త



## వానాకాలం జర జాగ్రత్త!

**డ్రైనేజీల నిరంతర శుభ్రత**

**నీరు నిల్వ కాకుండా ముందస్తు చర్యలు**

**శానిటేషన్‌పై దృష్టి**

**ఫాగింగ్ మిషన్లు, బ్లీచింగ్ పౌడర్ ఏర్పాటు**

**సమర్థవంతంగా వ్యర్థాల వ్యవస్థ నిర్వహణ**

**అధికారులకు కలెక్టర్ ఆదేశం**

**వికారాబాద్, పరిగి, కొడంగల్, తాండూర్ పట్టణాల అభివృద్ధిపై ప్రభుత్వం ఫోకస్**



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ

**వికారాబాద్, ప్రభాతవార్త :** వికారాబాద్, పరిగి, తాండూరు, కొడంగల్ పట్టణాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని కలెక్టర్ దీపక్ తివారీ తెలిపారు. గురువారం తన ఛాంబర్‌లో ఆయా మున్సిపాలిటీల పరిధిలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, పారిశుధ్య నిర్వహణ, మౌలిక వసతుల కల్పన, ప్రజా సేవల అమలుపై మున్సిపల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పట్టణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. రోడ్లు, డ్రైనేజీలు, వీధి దీపాలు, పార్కులు, తాగునీటి సరఫరా తదితర పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని, చెత్త సేకరణ, వ్యర్థాల నిర్వహణ వ్యవస్థలను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని డ్రైనేజీల శుభ్రత, నీరు నిల్వ కాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. వర్షా కాలం వస్తున్నందున శానిటేషన్‌పై దృష్టి పెట్టాలని, ఫాగింగ్ మిషన్లు, బ్లీచింగ్ పౌడర్ ఏర్పాటు చేయాలనీ ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలని, మున్సిపల్ సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యత ఇస్తూ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, జడ్పి సీఈఓ సుధీర్, మున్సిపల్ కమిషనర్లు, విక్రమ్ సింహ రెడ్డి, బలరాం నాయక్ పాల్గొన్నారు.

## ప్రతి బూత్‌లోనూ నిఘా

**✦కాంగ్రెస్ ఓటర్లను తొలగించటానికి కుట్ర ✦పార్టీ నాయకులు అప్రమత్తంగా ఉండాలి ✦ఓటర్ల హక్కుల పరిరక్షణ కోసం కాల్‌సెంటర్ ✦సర్ ప్రక్రియపై బిఎల్‌ఏలకు డిసిసి చీఫ్ దిశానిర్దేశం**



బిఎల్ఎలకు సర్ శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న వజ్రేశ్‌యాదవ్

**శామీర్‌పేట, (మేడ్చల్ జిల్లా ప్రతినిధి), జూన్ 11, ప్రభాతవార్త :** బిఎల్‌ఏలే కాంగ్రెస్ పార్టీకి వెన్నెముక అని, ఎస్ఐఆర్ ప్రక్రియపై వారు పూర్తి అవగాహన పొందాలని మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు తోటకూర వజ్రేశ్‌యాదవ్ సూచించారు. గురువారం శామీర్‌పేట మండలంలోని అంతాయిపల్లిలోని ఎన్ఎన్ఆర్ వేద్ కన్వెన్షన్ హాల్‌లో మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ బిఎల్ఏలకు సర్ (ఎస్ఐఆర్) ప్రక్రియ నమోదు విషయంపై నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆయన అధ్యక్షోపన్యాసం చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైనదన్నారు. అర్హులైన ప్రతి పౌరుడి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా చూసే కాంగ్రెస్ పార్టీ నాయకులపై బాధ్యత ఉందన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియ పేరుతో అర్హులైన ఓటర్ల పేర్లను జాబితాల నుంచి తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయనే అనుమానాలున్నాయన్నారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ఓటర్లను తొలగించకుండ పార్టీ నాయకులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఓటర్ల హక్కులను పరిరక్షించేందుకు టిపిసిసి ఆధ్వర్యంలో కాల్‌సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఓటరు నమోదు, సవరణల కోసం అవసరమైన పత్రాలు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ దరఖాస్తు విధానాలు, ఫారముల వినియోగం, ఇంటింటి సర్వే నిర్వాహణ, ఎన్నికల అధికారులతో సమన్వయం వంటి అంశాలపై వివరించారు. ప్రతి బూత్‌లో ఒక్క అర్హుడైన ఓటరు కూడ జాబితా నుంచి తప్పిపోకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని బిఎల్‌ఏలకు సూచించారు. మేడ్చల్ నియోజకవర్గంలో మొత్తం 602బూత్‌లు ఉన్నట్లు 602మంది బిఎల్‌ఏలను ఏర్పాటు చేసి శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. బూత్ స్థాయి నుంచి కాంగ్రెస్ పార్టీ బలోపేతంకు ఈ శిక్షణ దోహదపడుతుందన్నారు. రానున్న నగర మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలతో మమేకం అయ్యే వారికే పార్టీ టికెట్లు దక్కుతాయని సర్వేల ఆధారంగానే ఎంపిక జరుగుతుందని స్పష్టంచేశారు. ట్రైనర్ బసవరాజు శ్రీనివాస్ మాట్లాడుతూ.. సర్ ప్రక్రియ నమోదుపై బిఎల్ఎలతో పాటు పార్టీ నాయకులు కూడ పాల్గొనాలని, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని, అర్హులైన ఓటర్లను సర్ నమోదులో పాల్గొనేలా చూడాలని నమోదు పత్రాలపై అవగాహన కల్పించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ సర్ గురించి అవగాహన కల్పించారు. రాష్ట్ర బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ చైర్మన్, టిపిసిసి ట్రైనర్ బసవరాజు శ్రీనివాస్, టిపిసిసి సీనియర్ అదికార ప్రతినిధి ఎస్.హరివర్ధన్‌రెడ్డి, నియోజకవర్గాల కోఆర్డినేటర్లు గజ్జెల కాంత్, సమీర్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి పీసరి మహిపాల్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బి.నర్సింలుయాదవ్, జిల్లా ఆర్టీఏ మెంబర్ బి.జైపాల్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు జీడిపల్లి వేణుగోపాల్‌రెడ్డి, వేముల మహేశ్‌గౌడ్, అలియాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ కె.శిరీషకృష్ణారెడ్డి, మాజీ మేయర్ శాంతి కోటేశ్‌గౌడ్, తదితరులతోపాటు నియోజకవర్గంలోని 16డివిజన్ల నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.

## పనుల నాణ్యతలో రాజీ లేదు

**మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యం**

**కలెక్టర్ దీపక్ తివారీ ఆదేశం**



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ దీపక్ తివారీ

**కొడంగల్, జూన్ 11 ప్రభాతవార్త :** కొడంగల్ మున్సిపల్ పరిధిలో కొనసా గుతున్న అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయా లని జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ ఆదేశించారు. గురు వారం కొడంగల్ మున్సిపల్ పరిధిలో కొనసాగుతున్న పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. మున్సిపాలిటీ పరిధిలో చేపడుతున్న రోడ్లు, డ్రైనేజీలు, పారిశుధ్య పనులు, మౌలిక వసతుల అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని ప్రత్యక్షంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ముందుగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం గుండ్లకుంట గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీ సమస్యలపై వాకబు చేశారు.

**నిర్ణీత గడువు లోగా పూర్తి చేయాలి**

అనంతరం కొడంగల్ పట్టణంలో బాలుర వసతి గృహం నిర్మాణ పనులు, స్విమ్మింగ్‌పూల్ పనులు, జడ్పీహెచ్ఎస్ బాలికల ఉన్నత పాఠశాల నిర్మాణ పనులను పరశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంభందిత అధికారులను ఆదేశించారు.

పనుల్లో ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అభివృద్ధి కార్యక్రమాల అమలుపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ కొనసాగించాలని, ప్రజల అవసరాలకు అనుగుణంగా పనులను చేపట్టాలని అధికారులకు తెలిపారు. పనుల నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కొడంగల్ కడా ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ బలరాంనాయక్, ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.




## ఎట్టకేలకు విముక్తి

**జిల్లా పరిషత్ ప్రాంగణంలోకి రిజిస్ట్రార్ కార్యాలయాల తరలింపు**

**ఏళ్ల తరబడి ప్రైవేట్ భవనంలోనే సేవలు**

**మేడ్చల్, జూన్ 11, ప్రభాతవార్త :** ఎన్నో సంవత్సరాలుగా మేడ్చల్ జాతీయ రహదారి సమీపంలోని ఓ ప్రైవేట్ భవనంలో కొనసాగుతున్న జిల్లా రిజిస్ట్రార్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఎట్టకేలకు ప్రభుత్వ భవనంలోకి మారాయి. గురువారం నుంచి ఈ కార్యాలయాలు మేడ్చల్ జిల్లా పరిషత్ కార్యాలయ భవనంలో తమ కార్యకలాపాలను ప్రారంభించాయి. చాలా కాలంగా ప్రజలు, ప్రజాప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు చేస్తున్న డిమాండ్లకు ఇది ఫలితంగా నిలిచింది. జిల్లా కేంద్రంలో కీలకమైన ఈ కార్యాలయాలు ప్రైవేట్ భవనంలో కొనసాగడంపై చాలా కాలంగా విమర్శలు వ్యక్తమయ్యాయి. సరైన పార్కింగ్, నిరీక్షణ వసతి, తాగునీరు, ప్రజలకు అవసరమైన ఇతర మౌలిక సదుపాయాలు లేకపోవడంతో రిజిస్ట్రేషన్ పనుల కోసం వచ్చిన ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

**అద్దె భవనాలలో అగచాట్లు**

గంటల తరబడి వేచి ఉండాల్సి రావడంతో అసౌకర్యానికి గురయ్యారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వ భవనంలోకి కార్యాలయాలను మార్చాలని పలువురు ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, సామాజిక కార్యకర్తలు జిల్లా కలెక్టర్‌తో పాటు రాష్ట్ర ప్రభుత్వానికి పలుమార్లు వినతిపత్రాలు సమర్పించారు. ప్రభుత్వ కార్యాలయాలు అనవసరంగా ప్రైవేట్ భవనాల్లో కొనసాగకుండా ప్రభుత్వ భవనాలకు మారాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిన తర్వాత కూడా చాలా కాలం పాటు ప్రైవేట్ భవనంలోనే కొనసాగడం చర్చనీయాంశంగా మారింది. ఈ అంశంపై స్థానిక ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకువస్తూ ప్రభాతవార్త పలుమార్లు ప్రత్యేక కథనాలను ప్రచురించిన విషయం విదితమే. ప్రజల వినతులు, ప్రభుత్వ ఆదేశాల నేపథ్యంలో చివరకు అధికారులు స్పందించి కార్యాలయాలను జిల్లా పరిషత్ కార్యాలయ భవనానికి తరలించారు. ఇక పాత భవనం వద్ద రిజిస్ట్రేషన్ కార్యకలాపాలకు అనుబంధంగా డాక్యుమెంట్ రైటర్ల కోసం ప్రత్యేక గదులు, దుకాణాలు ఏర్పాటు చేయబడ్డాయి. కార్యాలయం జిల్లా పరిషత్ భవనానికి మారడంతో అక్కడ కూడా డాక్యుమెంట్ రైటర్ల కోసం కొత్తగా దుకాణాలు ఏర్పాటు కాబడ్డాయి. కార్యాలయం మారిన వెంటనే కొత్త ప్రాంగణం పరిసరాల్లో ఈ ఏర్పాట్లు జరగడం స్థానికంగా చర్చకు దారితీసింది. ప్రభుత్వ భవనంలోకి కార్యాలయాల మార్పుతో ప్రజలకు మెరు గైన సేవలు అందే అవకాశం ఉందని స్థానికులు అభి.ప్రాయపడుతున్నారు. కొత్త ప్రాంగణంలో పార్కింగ్, ప్రజా సౌకర్యాలు, డాక్యుమెంట్ రైటర్ల నిర్వహణ వంటి అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరుతున్నారు.

## మంజీరా పైప్‌లైన్‌కు భారీ లీకేజీ

**మరమ్మతు నిమిత్తం నీటి సరఫరాకు అంతరాయం**

**హైదరాబాద్, జూన్ 11 ప్రభాతవార్త :** నగరానికి తాగునీరు సరఫరా చేసే మంజీరా ఫేజ్-2లోని కలబ్‌గూర్-పటాన్‌చెరు పంపింగ్ మెయిన్‌కు చెందిన 1500 మి.మీ. వ్యాసం గల ప్రధాన పైప్‌లైన్‌లో రుద్రారం గ్రామం సమీపంలో భారీ లీకేజీ ఏర్పడింది. ఈ భారీ లీకేజీలను అరికట్టడానికి జలమండలి అధికారులు అత్యవసర మరమ్మతు పనులు చేపట్టారు. దీంతో నగరంలోని పలు ప్రాంతాల్లో నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, పనులు పూర్తి కాగానే యధావిధిగా నీటి సరఫరా పునరుద్ధరణ జరుగుతుదని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి తెలిపారు. మరమ్మతుల పనులపై తాజా పరిస్థితి వివరాలను తెలుసుకున్నారు. ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్, ట్రాన్స్‌మిషన్ అధికారులు సమన్వయంతో పనులు చేపట్టాలన్నారు. సాధ్యమైనంత తొందరగా పనులు పూర్తి చేసి నీటి సరఫరాను పునరుద్ధరించాలని ఆదేశించారు.

## మేడ్చల్ కలెక్టరేట్ వద్ద ఉద్రిక్తత

**★లక్ష ఉద్యోగాల హామీ అమలు కోరుతూ ఎఐవైఎఫ్ భారీ ఆందోళన ★కార్యాలయం ముట్టడికి ప్రయత్నం ★ అడ్డుకున్న పోలీసులతో వాగ్వాదం ★అరెస్ట్‌లకు దారితీసిన నిరసన**




ధర్నాలో పాల్గొన్న ఎఐవైఎఫ్ నాయకులు




ఆందోళనకారులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జూన్ 11, ప్రభాతవార్త :** మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టరేట్ వద్ద జరిగిన ఎఐవైఎఫ్ నాయకుల ధర్నాలో ఉద్రిక్తత పరిస్థితి ఏర్పడింది. దీనిలో పోలీసులకు, ఏఐవైఎఫ్ నాయకుల మధ్య వాగ్వివాదం జరగటం, ఉద్రిక్తత పరిస్థితి చోటుచేసుకోవటంతో ధర్నాలో పాల్గొన్న వారిని అదుపులోకి తీసుకుని వాహనాల్లో శామీర్‌పేట పోలీస్‌స్టేషన్‌కు తరలించి పలువురు నాయకులను అరెస్ట్ చేశారు. గురువారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ వద్ద ఏఐవైఎఫ్ ఛలో కలెక్టరేట్ పేరుతో ధర్నా నిర్వహించారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించటంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని, ప్రభుత్వ ఖాళీ పోస్టుల నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఎఐవైఎఫ్ రాష్ట్ర సమితి పిలుపు మేరకు జిల్లా ఎఐవైఎఫ్ నాయకులు ధర్నా చేశారు. కలెక్టరేట్ ముట్టడికి యత్నించటంతో పోలీసులకు, ఎఐవైఎఫ్ నాయకుల మధ్య వాగ్వివాదం జరిగి ఉద్రిక్తత పరిస్థితి చోటుచేసుకుంది. ఈ సందర్భంగా జరిగిన ధర్నాలో ఎఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మేంద్ర మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన లక్ష ఉద్యోగాల భర్తీ ఏమైందని సిఎంను ప్రశ్నించారు. ఖాళీ పోస్టులు ప్రభుత్వంలో ఉండటంతో నిరుద్యోగ యువతలో నిరాశలు ఏర్పడినట్లు తెలిపారు. ఉద్యోగ ఖాళీలపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విద్యా సంస్థల బలోపేతం అంటే పాఠశాలలను మూసివేయటమా అని నిలదీశారు. తెలంగాణలో లక్షలాది మంది నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం ఎదురుచూస్తుండగ, ప్రభుత్వం మాత్రం హామీలు, ప్రకటనలతో కాలయాపన చేస్తుందని ఆయన విమర్శించారు. ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయకుండా ప్రభుత్వ విద్యా సంస్థలు కొన్నింటిని మూసివేత సరికాదని ఆయన విమర్శించారు. యువతకు ఉద్యోగాలపై ఆశలు చూపించి నియామకాల విషయంలో స్పష్టమైన కార్యచరణ లేకపోవటం యువత ఆందోళన చెందే విధంగా చేస్తుందని ఆయన విమర్శించారు. రాష్ట్రంలో ఖాళీగ ఉన్న పోస్టులపై ప్రభుత్వం శ్వేతపత్రంను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వివిధ శాఖల్లో ఎంత మంది పనిచేస్తున్నారు.

**ఖాళీ పోస్టులపై శ్వేతపత్రం ఇవ్వండి**

ఎన్ని పోస్టులు ఖాళీగ ఉన్న విషయాన్ని సమగ్ర శ్వేతపత్రం ద్వారా తెలియజేయాలని ధర్మేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యారంగం కూడ తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని, ఉపాధ్యాయుల కొరత, మౌలిక వసతుల కొరత, నిధుల కొరత కారణంగా విద్యా వ్యవస్థ బలహీనపడుతోందన్నారు. ఫీజుల పేరిట దోపిడీ కొనసాగుతుందని ఆయన ఆరోపించారు. విద్యార్థులకు ఫీజు రియింబర్స్‌మెంట్ బకాయిలు, ఉపకారవేతనాలు పెండింగ్‌లో ఉన్నట్లు వెంటనే విడుదల చేయాలన్నారు. ఉద్యోగాల భర్తీకి బదులుగా కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ విధానాలను ప్రోత్సహించటం యువత భవిషత్‌తో చెలగాటమని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించాలని, విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని లేకుంటే, రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ధర్నాలో పాల్గొన్న వారిని శామీర్‌పేట పోలీస్‌స్టేషన్‌కు తరలించి అరెస్ట్ చేశారు. వీరిని శామీర్‌పేట మండల సిపిఐ కార్యదర్శి డిజి నరేంద్రప్రసాద్ కలిసి సంఘీభావం తెలియజేశారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి టి.సత్యప్రసాద్, ఉపాధ్యక్షులు చంద్రశేఖర్, గిరిబాబు, శివకుమార్, వికాస్‌రెడ్డి, ప్రీతం, సుదర్శన్, భరత్, నర్సింహ్మా, మధు, చందు, శ్రీకాంత్, మురళి, ఇస్మాయిల్, ఫరూఖ్, పలువురు నిరుద్యోగులు, యువత పాల్గొన్నారు.

## జంట హత్య కేసులో నిందితురాలి మృతి

**▶అవమానభారం భరించలేక ఠాణాలో యాసిడ్ తాగిన కరీమాబేగం! ▶హైదరాబాద్‌లో రెండు వారాలుగా చికిత్స ▶కాపలాగా ఉన్న ఇద్దరు కానిస్టేబుళ్లపై వేటు ▶ స్టేషన్ అధికారులు తప్పించుకుంటున్నారని ప్రజా సంఘాల ఆందోళన**

**ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి/తాండూరు :** మోయినాబాద్ ఫాం హౌస్ జంట హత్యల కేసులో ప్రధాన నిందితురాలు మృతి చెందింది. విచారణలో ఉండ గానే పోలీస్‌స్టేషన్‌నే ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన కరీమాబేగం చికిత్స పొందు తూ మృతి చెందినట్లు తెలిసింది. గత నెల 16న రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండల పరిధిలో చోటుచేసుకున్న తాండూరు జంట మహిళల దారుణ హత్య కేసు రాష్ట్రంలోనే సంచలనం సృష్టించింది. ఈ కేసులో ప్రధాన నింది తురాలుగా ఉన్న కరీమా బేగంను విచారణలో భాగంగా తాండూరు మండలం కరణ్‌కోట్ పోలీ స్టేషన్‌కు తరలించారు. ఆమె పోలీస్టేషన్‌లో బాత్ రూంలోకి వెళ్లి అక్కడ ఉన్న యాసిడ్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్ప డింది. దీంతో పోలీసులు ఆమెను మెరుగైన చికిత్స నిమిత్తం హైద రాబాద్‌కు తరలించారు. 24రోజులుగా హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో మృత్యువుతో పోరాడుతున్న కరీమా బేగం బుధవారం రాత్రి ప్రాణాలు విడిచింది.

**ఉలిక్కిపడ్డ పోలీస్ బాస్‌లు**

ఈ కేసు విషయలో కరీమా బేగం పోలీస్టేషన్‌లోనే ఆత్మహత్యాయత్నానికి పాల్పడటంతో పోలీసు అధికారులలో కలకలం రేగింది. నిందితురాలికి కాపలాగా డ్యూటీ లో ఉన్న సునీత, బసవరాజు అనే ఇద్దరు కానిస్టేబుళ్లను సస్పెన్షన్ చేసి చేతులు దులుపుకున్నారు. అయితే, విచరణలో ఉండగానే కరీమా బేగం ఆత్మహత్యాయత్నానికి పాల్పడటానికి స్టేషన్ అధికారుల నిర్లక్ష్యమే కారణమని.. ఎస్‌హెచ్‌ఓను తప్పించి, కింది స్థాయి సిబ్బందిపై చర్యలు తీసుకోవడమేమిటని ప్రజాసంఘాలు ప్రశ్నిస్తున్నాయి. ఈ సంఘటనకు స్టేషన్ అధికారులే బాధ్యత వహించాలని, ఎస్‌హెచ్‌ఓతో పాటు సిఐపై కూడా చర్యలు తీసుకోవాలని సీపీఎం నేతలు డిమాండ్ చేస్తున్నారు.

**ఉన్నతాధికారుల అంతర్మధనం**

ఇద్దరు కానిస్టేబుళ్లపై వేటు వేసిన పోలీసు ఉన్నతాధికారులు తాజా సంఘటనతో ఆందోళన చెందుతున్నారు. కేవలం కానిస్టేబుళ్లపై వేటు వేసి సరిపెట్టాలా, లేక బాధ్యులుగా మరో ఇద్దరు అధికారులపై వేటు వేయాలా అనే మీమాంసలో ఉన్నట్లు తెలుస్తోంది.

**నిబంధనలకు భిన్నంగా అందుబాటులో రసాయనాలు**

నగర శివారులోని మొయినాబాద్ వద్ద ఓ ఫాంహౌజ్ పరిసరాలలో తాండూరుకు చెందిన ఇద్దరు మహిళలు హత్యకు గురవ్వగా.. ఈ కేసులో ప్రధాన నిందితురాలిని విచారణ నిమిత్తం యాలాల పోలీస్‌స్టేషన్‌కు కాకుండా తాండూరు రూరల్ సర్కిల్ ఆఫీసుకు పిలిపించారు. ఈ ఆఫీసు గౌతాపూర్ వద్ద ఉన్న విషయం తెలిసిందే.

దీన్నే కరణ్‌కోట పోలీసుస్టేషన్‌గా పిలుస్తుంటారు. పోలీసు స్టేషన్లలో యాసిడ్ వంటి రసాయనాలను అందుబాటులో ఉంచరాదన్న నిబం ధనలు ఉన్నాయి. అయితే, ఇటీవల ఉన్నతాధికారుల పర్యవేక్షణ ఉన్నందున మరుగుదొడ్లను శుభ్రం చేసేందుకు యాసిడ్ తెచ్చినట్లు సమాచారం. ఈ కేసులో తనపై అభియోగాలు రావడంతో నిందితురాలు అవమానభారం భరించలేక యాసిడ్ తాగి ఉండవచ్చని భావిస్తున్నారు.

**సకాలంలో రిమాండ్‌కు పంపటంలో విఫలం?**

అయితే, ఆమెను సకాలంలో రిమాండ్‌కు తరలించడంతో అధికారులు విఫలమైనారని విమర్శలు వస్తున్నాయి. ఈ వ్యవహారంలో శాఖపరంగా ఓ అధికారికి ఛార్జ్‌మెమో ఇచ్చి ఇద్దరు అధికారులపై వేటు వేయాల్సి ఉంటుందని రిటైర్డ్ పోలీసు అధికారి ఒకరు తెలిపారు. కానీ వారు తప్పించుకునేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

**పదేళ్ల క్రితం ఆత్మహత్య ఘటనలో అలా!**

కరణ్‌కోట పోలీసుస్టేషన్‌లో పదేళ్ల క్రితం ఓ నిందితుడు ఠాణా భవనం నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆ తర్వాత అనేక సంఘటనలు జరిగాయి. అక్కడ పని చేస్తున్న అధికారులలో చాలా మంది సస్పెన్షన్‌కు గురయ్యారు. తాజా సంఘటనలో ఇద్దరు కానిస్టేబుళ్లను బలవంతంగా ఇరికించారని ఆరోపిస్తున్న ప్రజాసంఘాలు నిస్పక్షపాతంగా వ్యవహరించి సమగ్ర విచారణ జరిపించాలని డిమాడ్ చేస్తున్నాయి.



మాదాపూర్ దుర్గం చెరువు సమీపంలో ఎస్ఎన్‌డిపి ప్రాజెక్ట్ కింద కట్టిన వరద కాలువ అనుసంధాన సమస్యను పరిశీలిస్తున్న కమిషనర్ రంగనాథ్

## రెండు రోజులే గడువు

**డ్రెయిన్ల ప్రక్షాళనకు హైడ్రా కమిషనర్ డెడ్‌లైన్**

**ఇన్‌లెట్ల మరమ్మతులకు ఆదేశం**

**హైదరాబాద్, జూన్ 11, ప్రభాతవార్త:** నగరంలో వరద ముంచెత్తిన ప్రాంతాలను హైడ్రా కమిషనర్ రంగనాథ్ గురువారం పరిశీలించారు. మాదాపూర్, కొండాపూర్, మియాపూర్ ప్రాంతా ల్లో క్షేత్ర స్థాయిలో పర్యటించి వరద ముంచెత్తడా నికి గల కారణాలను తెలుసుకున్నారు. కొండాపూర్ నుంచి మొండికుంటకు చేరాల్సిన వరద నీరు ప్రవాహానికి మీనాక్షి టవర్స్ వద్ద డ్రైన్లో తలెత్తిన ఇబ్బందులే కారణమని గుర్తించారు. బాక్స్ డ్రైన్‌ను పూర్తిగా స్లాబ్ వేసి మూసేయడంతో అం దులో పూడికను తీయడానికి వీలు లేని పరిస్థితి ఉతులున్నాయి. అలాగే మీనాక్షి టవర్స్ వద్దకు వచ్చేసరికి వరద కాలువ కుంచించుకుపోవడం కూడా ఒక కారణంగా గుర్తించారు. వెంటనే కాలువను తెరిపించి..పూడికను తొలగించాలని కమిషనర్ ఆదేశించారు. అవసరమైతే కాలువను విస్తరించాలని సూచించారు. ఒక్క మొండి కుంట వద్దే కాకుండా.. గచ్చిబౌలి ప్రధాన రహదారిలోని బయోడైవర్సిటీ పార్కు పరిసరాలు నీట మున గడానికి కూడా అక్కడ ఉన్న ఖాజాగూడ చెరువు తో పాటు.. మల్కం చెరువుకు వెళ్లే ఇన్‌లెట్లు సరిగా లేకపోవడమే కారణమని గుర్తించారు. ఇన్‌లెట్లు సరిచేసేందుకు చర్యలు తీసుకోవాలని రెండు రోజుల్లో ఈ పనులన్నీ పూర్తి చేయాలని ఆదేశించారు. మొదటి వర్షం కారణంగా పెద్దమొ త్తంలో రహదారులపై ఉన్న వ్యర్థాలు కొట్టుకు వచ్చి చెత్త అడ్డుపడడం వల్ల కూడా చాలా చోట్ల వరద రహదారులను, పరిసరాలను ముంచెత్తిన ట్టు గ్రహించారు. రాయదుర్గం మెట్రో స్టేషన్ పరిసరాల్లో పూడుకుపోయిన నాలా, మ్యాన్‌హో ల్ కారణంగానే వరద నీరు నిలిచిందని.. వెంటనే సమస్య పరిష్కరించాలని సూచించారు. ఎస్ ఎన్‌డీపీ ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన బాక్స్ డ్రైన్‌కు గతంలో ఉన్న లైన్లను అనుసంధానం చేయడంలో తలెత్తిన ఇబ్బందులతోనే మాధాపూ ర్‌లోని నెక్టర్ గార్డెన్స్ పరిసరాల్లో రహదారులు నీట మునిగాయని గుర్తించారు. ఈ అనుసంధా నంతో పాటు.. రహదారులపై నుంచి వచ్చే వర ద కాలువలోకి వెళ్లేలా అక్కడ ఏర్పాట్లు చేస్తున్నారు. దుర్గం చెరువులో నీటి సామర్థ్యాన్ని కూడా తగ్గిస్తే ఈ ప్రాంతంలో వరద పోటెత్తదని.. ఆదిశగా చర్యలు తీసుకుంటున్నారు. మియాపూ ర్లోని గురునాథ్ చెరువుకు వెళ్లాల్సిన వరద కాలు వలు సరిగా లేకపోవడంతో జేపీనగర్ చౌరస్తాతో పాటు లక్కీ రెస్టారెంట్ వద్ద ప్రధాన రహదారిలో నీరు నిలిచిపోయిందని అధికారులు గుర్తించారు. ప్రిమార్క్ సుంకృతి అపార్ట్‌మెంట్ పరిసరాల్లో చెరువుకు వెళ్లాల్సిన వరద కాలువ ఆక్రమణలకు గురి కావడం మొత్తం మూసేయడంతో వరద నీరు రహదారులను ముంచెత్తిన పరిస్థితులను గమనించారు. అలాగే ఇటీవల కొత్తగా రహదారు లు నిర్మించినప్పుడు పక్కనే ఉన్న వరద కాలువల్లోకి వర్షం నీరు వెళ్లే ఏర్పాట్లు బంద్ అవ్వడం కూడా ఒక కారణంగా గుర్తించారు. వెంటనే వర ద కాలువలను పునరుద్ధరించేందుకు చర్యలు తీసు కుంటున్నారు. కమిషనర్ వెంట హైడ్రా అద నపు సంచాలకులు వర్ల పాపయ్య డీఎఫ్‌వో, ఎస్ ఎఫ్‌వో లు, వివిధ శాఖలకు చెందిన అధికారులు ఉన్నారు.

## కారు చక్రాల కింద పడి బాలుడు మృతి

**కుటుంబ సభ్యుల ఆందోళన**

**అత్తాపూర్ జూన్11, ప్రభాతవార్త :** మైలర్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో విషాద ఘటన చోటుచేసుకుంది. కారు చక్రాల కింద పడి శివం (3) అనే బాలుడు మృతి చెందాడు. విజయ్ నేహా పాలిమర్స్ కంపెనీకి చెందిన కారు ప్రమాదానికి కారణమైనట్లు గుర్తించారు. ఈ ఘటనతో ఆగ్రహానికి గురైన బాలుడి కుటుంబ సభ్యులు, బంధువులు కంపెనీ ముందు ఆందోళన చేపట్టారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## సమస్యలు పరిష్కరించాలని కమిషనర్‌కు వినతి

**ఘట్‌కేసర్, జూన్ 11, ప్రభాతవార్త:** మేడ్చల్ నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ బిజెపి రాష్ట్రకార్యవర్గసభ్యులు-ఘట్‌కేసర్ మాజీ ఎంపిపి ఏనుగు సుదర్శన్‌రెడ్డి, బిజెవైఎం జిల్లా అధ్యక్షులు బండారు పవన్‌రెడ్డితో కలిసి మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి.వినయ్‌కృష్ణారెడ్డిని కోరారు. ఈమేరకు తార్నాకలోని కమిషనర్ కార్యాలయంలో ఎంఎంసి కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువా, పూలమొక్క అందజేశారు. ఈసందర్భంగా నియోజకవర్గంలోని వివిధ సమస్యలను పరిష్కరించాలని సుదర్శన్‌రెడ్డి వినతిపత్రం అందజేశారు. ఓఆర్ఆర్ పక్కన చెత్తను తగులబెడుతున్నారని వాయు కాలుష్యంతో ప్రజల ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందని తెలిపారు. వివిధ కాలనీల్లో మంచినీటి పైపులైన్ దెబ్బతిన్నాయని మరమ్మత్తులు చేపట్టి ప్రజలకు స్వచ్ఛమైన త్రాగునీటిని అందించాలని కోరారు. లేఔట్లలో పార్కుల కోసం కేటాయించిన స్థలాలు ఆక్రమణకు గురవుతున్నాయని, నకిలీ పత్రాలతో కబ్జాకు పాల్పడుతున్నారని వారిపై కఠిన చర్యలు తీసుకొని పార్కు స్థలాలను పరిరక్షించాలని విజ్ఞప్తి చేశారు. హెచ్‌ఆర్‌డిసి ఆధ్వర్యంలో జాతీయరహదారి 163 నుంచి చర్లపల్లి వరకు చేపట్టిన రోడ్డు పనులు ఘట్‌కేసర్ యంనంపేట్ చౌరస్తా నుంచి మాధవరెడ్డి వంతెన వరకు జరుగుతున్న పనులు మధ్యలోనే నిలిచిపోయి వాహనదారులకు ఇబ్బందికరంగా మారిందని సంబంధిత శాఖల సమన్వయంతో త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన కమిషనర్‌ను కోరారు.

## నిమ్స్‌లో చికిత్సకు ఎల్‌ఓసి అందజేత

**ఘట్‌కేసర్, జూన్ 11, ప్రభాతవార్త:** నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగికి చికిత్స కోసం రూ.2,75,000ల ఎల్‌ఓసీ పత్రాన్ని మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అందజేశారు. ఘట్‌కేసర్‌కు చెందిన శ్రీనివాస్ కుమారుడు జస్వంత్ ముదిరాజ్ అనారోగ్యంతో నిమ్స్ ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతున్నాడు. ఆసుపత్రి వైద్య ఖర్చులు అధికం కావడంతో ముఖ్యమంత్రి సహాయనిధి పథకానికి స్థానిక శాసనసభ్యులు చామకూర మల్లారెడ్డి ద్వారా ధరఖాస్తు చేసుకున్నాడు. ఈమేరకు సీఎం ఆర్ఎఫ్ నుంచి రూ.2,75,000లు మంజూరు కావడంతో ఎమ్మెల్యే మల్లారెడ్డి చేతుల మీదుగా ఎల్‌ఓసీ పత్రాన్ని శ్రీనివాస్‌కు అందజేశారు. ఈకార్యక్రమంలో ఘట్‌కేసర్ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ ఎస్‌టీ సెల్ అధ్యక్షులు బిజిలి సదానందం, బీఆర్ఎస్ నాయకులు ఎండి సిరాజ్‌లు పాల్గొన్నారు.



పాఠశాలలో సదుపాయాలను పరిశీలిస్తున్న బిజెపి నేతలు

## పాఠశాలలో సదుపాయాలు లేక ఇబ్బందులు

-అధికారులు,ప్రజాప్రతినిధులు చర్యలు చేపట్టాలి

- డివిజన్ బిజెపి అధ్యక్షుడు సందీప్ ముదిరాజ్

**అత్తాపూర్ జూన్ 11,ప్రభాతవార్త :** అత్తాపూర్ సర్కిల్ పరిధిలోని ఉప్పరపల్లి ప్రభుత్వం పాఠశాలలో సరైన మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని రాజేంద్రనగర్ డివిజన్ బిజెపి అధ్యక్షుడు సందీప్ ముదిరాజ్ పేర్కొన్నారు. గురువారం ఉప్పరపల్లిలో ప్రభుత్వ పాఠశాలను సందీప్ ముదిరాజ్



పాడైపోయిన బాత్‌రూమ్ డోర్‌లు

సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలకు పహారి గోడ లేకపోవడంతో విద్యార్థులకు తరచుగా రోడ్డు ప్రమాదాలు జరుగుతు న్నాయని అదేవిధంగా మంచినీటి సమస్య క్లాస్ రూమ్‌లలో కూర్చునే బెంచ్‌లు లేకపోవడం బాధకమరమిని బాత్‌రూమ్‌లలో సదుపాయాలు సరిగా లేకపోవడం దురదృష్టకరమన్నారు. ఎమ్మెల్యే మరియు మాజీ కార్పొరేటర్ ఎన్నోసార్లు వచ్చి పరిశీలించి వెళ్లిన సమస్యలు పరిష్కరం కాలేదని ఇప్పటికైనా ఉన్నత అధికారులు ,ప్రజాప్రతినిధులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యువమోర్చా నాయకుడు విజయ్ యాదవ్ పాల్గొన్నారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆకస్మిక తనిఖీ

**అత్తాపూర్ జూన్ 11,ప్రభాతవార్త :** మైలార్‌దేవ్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా రంగారెడ్డి జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారి డా. స్వర్ణ కుమారి సందర్శించి, అక్కడ అమలవుతున్న ఆరోగ్య కార్యక్రమాలు మరియు ప్రజలకు అందుతున్న వైద్య సేవలను




పరిశీలించారు. ఈ సందర్భంగా ఓపీ సేవలు, గర్భిణీ స్త్రీలకు అందిస్తున్న సేవలు, శిశు సంక్షేమ కార్యక్రమాలు, సంపూర్ణ టీకాకరణ, కుటుంబ నియంత్రణ కార్యక్రమాలు, అంటువ్యాధుల నియంత్రణ చర్యలు, ఎన్‌సీడీ స్క్రీనింగ్ కార్యక్రమాలు, ఔషధాల నిల్వలు మరియు రికార్డుల నిర్వహణను సమీక్షి ంచారు. ఆరోగ్య కేంద్రానికి వచ్చే ప్రతి రోగికి సకాలంలో, నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు.

ఆరోగ్య కేంద్రంలో పరిశుభ్రతను కచ్చితంగా పాటిస్తూ, రోగులకు మెరుగైన సేవలు అందించాలని తెలిపారు. అలాగే ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసి నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి స్థాయిలో సాధించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. మాతాశిశు ఆరోగ్య సూచికల మెరుగుదల, వంద శాతం టీకాకరణ, అధిక ప్రమాద గర్భిణీల గుర్తింపు మరియు పర్యవేక్షణ, క్షయవ్యాధి నియంత్రణ, రక్తపోటు మరియు మధుమేహం వంటి దీర్ఘకాలిక వ్యాధుల స్క్రీనింగ్ కార్యక్రమాల అమలులో మరింత చురుకుగా వ్యవహరించాలని సూచించారు. ఆరోగ్య కార్యక్రమాల అమలులో నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు ప్రతి సిబ్బంది సమిష్టిగా కృషి చేయాలని సూచించారు.

## మోదీ బాటలోనే రేవంత్ రెడ్డి.. కాంగ్రెస్‌కి కార్మికులు తగిన బుద్ధి చెప్తారు



సమావేశంలో ప్రసంగిస్తున్న బిఆర్‌టియు అధ్యక్షుడు రాంబాబు యాదవ్

**చిక్కడపల్లి జూన్ 11 ( ప్రభాతవార్త ) :** ప్రధాని నరేంద్ర మోదీ బాటలోనే సీఎం రేవంత్ రెడ్డి నడుస్తున్నారని, లేబర్ కోడ్స్ విషయంలో కాంగ్రెస్ పార్టీకి కార్మికులు తగిన బుద్ధి చెప్పేరోజులు ఆసన్నమైందని బి ఆర్ టి యు రాష్ట్ర అధ్యక్షుడు జి. రాంబాబు యాదవ్ తెలిపారు. గురువారం బాగ్ లింగంపల్లి బి ఆర్ టి యు రాష్ట్ర కార్యాలయంలో పూర్వ కనీసవేతన సవరణ బోర్డు పూర్వ చైర్మన్ పి. నారాయణ, బి ఆర్ టి యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల మారయ్య, టీవీ లక్ష్మణ్ కుమార్, సాంబశివ రావు లతో కలిసి ఏర్పాటు చేసిన మీడియా ప్రతినిధుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా రాంబాబు యాదవ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 4 లేబర్ కోడ్లను అమలు చేసే ప్రక్రియలో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం కార్మిక శాఖ అధికారుల చేత ఐఎన్‌టియుసి , ఏఐటియుసి యూనియన్లలో రూల్స్ ఫ్రేమ్ చేయటానికి కార్మిక శాఖ నిర్వహించిన సమావేశాన్ని బహిష్కరించడం జరిగిందన్నారు. యాజమాన్యాలకు అనుకూలంగా, కార్మిక వర్గానికి నష్టం చేసే విధంగా ఈ సమావేశం ఏర్పాటు చేశారన్నారు. పార్లమెంట్‌లో రాహుల్ గాంధీ ఈ చట్టాలను వ్యతిరేకిస్తూ, రాష్ట్రంలో అమలు చేయాలని తపన పడుతున్నారు. జూన్ 8 న కార్మిక సంఘాలతో ఢిల్లీలో వీటిని రాష్ట్రంలో అమలు చేస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్‌కి బిజెపికి తేడా లేదని అర్థమవుతోంది. మోదీ చెప్పుల్లో కాళ్ళు పెట్టి రేవంత్ రెడ్డి నడుస్తున్నారని విమర్శించారు. ఈ చట్టాల వద్దని మొదటి నుండి కార్మికులకు అండగా బి ఆర్ టి యు ఉందన్నారు. ఈ కార్యక్రమాలలో మోత్కూరి జైపాల్, జగదీష్, జిల్లెల్లె పి. నారాయణ, ప్రమోద్, క్రాంతి కుమార్, వేముల మోహన్, టి.వి. లక్ష్మణ్ రావు, సాయి రాజ్ తదితరులు పాల్గొన్నారు.

## లేబర్ కోడ్‌లను రాష్ట్రంలో అమలు చేయొద్దు ..కమిషనర్‌కు కార్మిక సంఘాల వినతి

**చిక్కడపల్లి జూన్ 11 ( ప్రభాతవార్త ) :** కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను తెలంగాణ రాష్ట్రంలో ఎట్టి పరిస్థితుల్లోనూ అమలు చేయవద్దని కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం కార్మిక శాఖ కమిషనర్ ను కార్మిక సంఘాల నేతలు కలిసి ఉమ్మడిగా వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా టి ఎన్ టి యు సి రాష్ట్ర అధ్యక్షుడు ఎం కె బోస్ మాట్లాడుతూ 2019, 2020 సంవత్సరాల్లో పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన ఈ లేబర్ కోడ్స్ కార్మికుల హక్కులను, ప్రయోజనాలను దెబ్బతీసే విధంగా ఉన్నాయని మండిపడ్డారు. వీటిని రద్దు చేయాలని దేశవ్యాప్తంగా, రాష్ట్రవ్యాప్తంగా అనేక సమ్మెలు, ఆందోళనలు నిర్వహించినప్పటికీ.. కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా రూల్స్ జారీ చేసి గెజిట్ పబ్లిష్ చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం కూడా ఈ లేబర్ కోడ్స్ రూల్స్ రూపొందిస్తూ వర్క్‌షాప్‌లు నిర్వహించడం సరికాదని హితవు పలికారు. రాష్ట్ర ప్రభుత్వం కార్మిక సంఘాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని, తాము రూపొందించిన రూల్స్‌ను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని అఖిల భారత, రాష్ట్ర స్థాయిల్లో అనేక సమ్మెలు, ఆందోళనలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ వినతిపత్రం సమర్పించిన వారిలో ఏ ఐ టి యు సి , ఐ ఎన్ టి యు సి, ఐ ఎఫ్ టి యు, ఏ ఐ యు టి యు సి , సీఐటీయూ తదితర ప్రధాన కార్మిక సంఘాల ప్రతినిధులు ఉన్నారు.



కార్మిక శాఖ కమీషనర్ కార్యాలయం వద్ద కార్మిక సంఘాల నిరసన వ్యక్తం చేసిన దృశ్యం

## దగ్గరి బంధువులని నమ్మితే మోసం చేశారు : వృద్ధురాలు

**హైదరాబాద్, జూన్ 11,ప్రభాతవార్త:** బంధువులని నమ్మితే 5 ఎకరాల వ్యవసాయ భూమిని అన్యక్రాంతం చేసి తనకు మోసం చేశారని ఓ మహిళ ఆవేదన వ్యక్తం చేసింది. గురువారం సోమాజీగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో భువనగిరికి చెందిన వృద్ధురాలు పోతం శెట్టి శ్రీవాణి మాట్లాడుతూ తన సమీప బంధువైన వెంకటేశ్వర్లు తనకు పూర్వికుల నుండి రావాల్సిన 5 ఎకరాల వ్యవసాయ భూమిని ఇతరులకు తన సమ్మతి లేకుండా విక్రయించాలడని ఆరోపించారు. తన పూర్వికుల ఆస్థిని (వ్యవసాయ భూమిని)ప్లాట్లు చేసి విక్రయించి తనకు రావాల్సిన వాట ఇవ్వడం లేదని వాపోయారు. తన వాటా గురించి ప్రశ్నిస్తే నేడు రేపు అంటూ కాలయాపన చేయడంతో అతని ఇంటికి వెళ్లగా తన పై పోలీసులతో బెందిరింపులకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. వెంకటేశ్వర్లుకు రాజకీయ ప్రాభల్యం ఉండటంతో పోలీసులు తన గోడు వినిపించుకోకుండా అతని వైపే నిలుస్తు నన్ను ఇబ్బందులకు గురి చేశారని బోరున విలపించారు. సమస్యను ఎవరికి చెప్పుకోవాలో తెలియక ఇబ్బందులు పడుతున్నానని, ముఖ్యమంత్రి తన సమస్యను పరిష్కారం చూపుతారని హైదరాబాద్‌కు వచ్చానని తెలిపారు. తన పూర్వికుల ఆస్థిని తనకు ఇవ్వకుండా మోసం చేస్తున్న తన బంధువు వెంకటేశ్వర్లు పై చట్ట రిత్యా చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, పోలీసు ఉన్నతాధికారులను కోరారు. సమావేశంలో ఆమెతో పాటు ఆమె కూతురు అనూహ్య, అల్లుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.




ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న వృద్ధురాలు

## అధ్యక్షుడు రాజీరెడ్డికి సత్కారం




రాజీరెడ్డిని సత్కరిస్తున్న ఎఐటియుసి నేతలు ఎం.నరి సింహ్మా, వి.ఎస్.బోస్, కె.రమేష్ తదితరులు

**సైఫాబాద్, జూన్ 11 ప్రభాతవార్త:** ఇటీవల జలమండలిలో గుర్తింపు సంఘంకు జరిగిన ఎన్నికల్లో ఎఐటియుసి మద్దతుతో విజయం సాధించిన తెలంగాణ జలమండలి ఎంప్లాయీస్ యూనియన్ (ఐఎన్‌టియుసి) అధ్యక్షుడు మొగుళ్ళ రాజీరెడ్డిని పలువురు నాయకులు ఘనంగా సత్కరించారు. గురువారం హిమాయత్‌నగర్‌లోని సత్య నారాయణరెడ్డి భవన్ ఎఐటియుసి రాష్ట్ర కార్యాలయంలో ఘనంగా ఆయనకు సన్మాన సభ జరిగింది. ఈ సందర్భంగా యూనియన్ గౌరవ అధ్యక్షుడు ఎం.నర్సింహ్మా, ఇతర ఎఐటియుసి నాయకులు రాజీరెడ్డికి పుష్పగుచ్చాలు అందించి, శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి సీనియర్ నాయకుడు వి.ఎస్.బోస్ ,యూనియన్ నాయకులు రాఘవేందర్‌రాజ్, అక్తర్, కె.రమేష్, ఎస్.కె.నర్సింహ్మా తదితరులు పాల్గొన్నారు.

## కుటుంబ ప్రోత్సాహమే యువత విజయాలకు బలమైన పునాది : బండారు దత్తాత్రేయ



మెట్టు బాంధవికి చేపట్టిన లడాఖ్ యాత్రను ప్రారంభిస్తున్న బండారు దత్తాత్రేయ

**ముషీరాబాద్, జూన్ 11, ప్రభాతవార్త:** కుటుంబ ప్రోత్సాహమే యువత విజయాలకు బలమైన పునాది అవుతుందని హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. గురువారం ముషీరాబాద్‌కు చెందిన మెట్టు బాంధవి అనే యువతి హైదరాబాద్ నుంచి లడాఖ్‌కు మోటార్ సైకిల్‌పై యాత్ర చేపట్టిన సందర్భంగా ఆయన శుభాకాంక్షలు తెలియచేశారు. బైక్ అండ్ టూరింగ్ కంపెనీ మరియు మ్యాడ్ ఓవర్ లడాఖ్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ యాత్రలో పది మంది రైడర్లు పాల్గొంటుండగా, హైదరాబాద్ బృందం నుంచి సుప్రియ, కార్తీక్, కైవల్య, మౌనిక, నవ్య, పల్లవి భాగస్వాములు కానున్నారు. ఈ సందర్భంగా వారికి అభినందనలు తెలియచేసిన దత్తాత్రేయ మాట్లాడుతూ నేటి యువత కలలు కనడమే కాకుండా వాటిని సాకారం చేసుకునేందుకు కృషి చేయాలని, బాంధవి చేపట్టిన ఈ సాహసోపేతమైన యాత్ర యువతలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించటమే కాకుండా యువతులు ఏరంగంలోనైనా ధైర్యంగా ముందుకు సాగగలరనే సందేశాన్ని సమాజానికి అందిస్తుందని తెలిపారు. లడాఖ్ వంటి క్లిష్ట భౌగోళిక పరిస్థితులు, ఎత్తైన పర్వత మార్గాలు, సవాళ్లతో కూడిన రహదారుల మధ్య ఈ యాత్రను చేపట్టటం వారి పట్టుదలకు నిదర్శనమన్నారు. బాంధవి విజయానికి ఆమె తల్లి తండ్రులు అందిస్తున్న సహకారం అభినందనీయమన్నారు. లడాఖ్ యాత్రను విజయవంతంగా పూర్తి చేసుకుని, సురక్షితంగా తిరిగి రావాలని, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి, యువతకు ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు.

## ఓఆర్ఆర్‌పై లారీలో చెలరేగిన మంటలు

**దుండిగల్, జూన్ 11 ప్రభాతవార్త:** పటాన్‌చెరు నుండి దుండిగల్‌కు ఔటర్‌రింగురోడ్డుపై వస్తున్న రాంకీ సంస్థకు చెందిన హాజరడస్ వేస్ట్ క్యారింగ్ లారీ ఎగ్జిట్ నంబర్ 5 వద్దకు చేరుకోగానే లారీలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన డ్రైవర్ సంస్థకు సమాచారం అందించడంతో సంస్థ ఫైర్ సిబ్బంది ఘటనాస్థలికి చేరుకోని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఎండ వేడికి మంటలు చెలరేగినట్లు పేర్కోంటున్నారు. సకాలంలో స్పందించి మంటలను అదుపులోకి తీసుకురావడంతో ప్ర మాదం తప్పింది. అనంతరం లారీని అక్కడి నుండి సం స్థకు తరలించారు. ఈఘటనకు సంబంధించిన వీడియో ను ఓ వాహనదారుడు సోషల్ మీడియాలో పోస్టు చేయ దంతో వైరల్ అయింది. అగ్నిమాపక, పోలీసుల శాఖ వారు ఘటనకు సంబంధించి ఎటువంటి సమాచారం లేనట్లు పేర్కోన్నారు.

## భౌరంపేటలో రెండు ఇళ్లలో చోరి

**దుండిగల్, జూన్ 11 ప్రభాతవార్త:** తాళం వేసి ఉన్న లక్ష్యంగా చేసుకున్న దుండగులు రెండు ఇళ్ళలో దొంగతనాలకు పాల్పడిన ఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..బౌరంపేట పరిధి వివిధ ప్రాంతాల్లోని తాళం వేసి ఉన్న రెండు ఇళ్ళలో తెల్లవారుజామున దుండగలు దొంగతనానికి పాల్పడ్డాడు. తాళం పగులగొట్టి ఇండ్లలో చొరబడి ఒక ఇంట్లో రూ,45వేల రూపాయల నగదు, మరో ఇంట్లో 18గ్రాముల బంగారు ఆభరణాలు, రూ,35వేల రూపాయలు నగదును ఎత్తుకెళ్ళారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. దొంగతనానికి వచ్చిన దృశ్యాలు సిసి కెమెరాల్లో రికార్డుయ్యాయి. వాటి ఆధారంగా దర్యాప్తును చేస్తున్నట్లు పోలీసులు పేర్కోన్నారు.

## నిశిరాత్రి సంచరిస్తున్న వ్యక్తికి జైలు

**చాంద్రాయణగుట్ట, జూన్ 11, ప్రభాతవార్త :** నిశిరాత్రి వేళ అనుమాస్పదంగా సంచరిస్తున్న ఒక వ్యక్తికి కోర్టు నాలుగు రోజుల జైలుశిక్ష విధించింది. బండ్లగూడ ఇన్‌స్పెర్ ఆర్.దేవేందర్ కథనం ప్రకారం... బండ్లగూడ హషామాబాద్‌కు చెందిన ప్రైవేటు ఉద్యోగి ముహమ్మద్ ఇస్మాయిల్ (48) రాత్రివేళ చీకట్లో సంచరిస్తున్నాడు. అనుమానం వచ్చిన పోలీసులు అతనిని వివరాలకై ప్రశ్నించగా పారిపోయాడు. పోలీసులు ఇస్మాయిల్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా పొంతనలేని సమాధానాలు ఇచ్చాడు. ఎస్ఐ పి.మహేందర్ అతనిపై ఈపెట్టీ కేసు నమోదు చేసి నాంపల్లిలోని 9వ స్పెషల్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ ముందు హాజరు పరిచారు. కేసును విచారించిన కోర్టు నిందితుడు ఇస్మాయిల్‌కు నాలుగు రోజులు జైలుశిక్ష విధించింది. పోలీసులు అతనిని చంచల్‌గూడ జైలుకు తరలించారు.

## 11 కిలోల గంజాయి స్వాధీనం.. ముగ్గురు అరెస్ట్

**పేట్ బషీరాబాద్, జూన్ 6, ప్రభాతవార్త**

కొంపల్లిలోని సెంట్రల్ పార్క్ ప్రాంతంలో గంజాయి విక్రయాలు జరుగుతున్నాయనే సమాచారంతో పేట్ బషీరాబాద్ పోలీసులు గురువారం మెరుపు దాడులు నిర్వహించారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించారు. పోలీసుల విచారణలో నిందితులు సూరజ్ మండల్, పరమేష్ బైరాగి, జయదేవ్ మండల్‌గా గుర్తించారు. వీరంతా ఒడిశా రాష్ట్రానికి చెందిన వారని పోలీసులు తెలిపారు. నిందితులను విచారించగా, ఒడిశా నుంచి అక్రమంగా గంజాయిని తీసుకువచ్చి కొంపల్లి ప్రాంతంలో విక్రయిస్తున్నట్లు అంగీకరించినట్లు సమాచారం. నిందితుల వద్ద నుంచి సుమారు 6 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చే సుకున్నారు. అనంతరం వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు వెల్లడించారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

## ఫీజు బకాయిలను చెల్లించకుండా విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటం

**సైఫాబాద్, జూన్ 11 ప్రభాతవార్త:** రాష్ట్రంలోని లక్షలాది మంది విద్యార్థులకు ఉపయోగకరంగా ఉన్న ఫీజుల రీయంబర్స్‌మెంట్ పథకం ప్రభుత్వం సంక్షేమ పథకమా? లేక ప్రైవేటు ఫైనాన్స్ పథకమా? అని రాష్ట్ర మాజీ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్, తెలంగాణ విద్యార్థి జెఎసి ఛైర్మన్ వేముల రామకృష్ణ ప్రశ్నించారు. విద్యార్థి జెఎసి ఆధ్వర్యంలో అనేక మంది విద్యార్థులు గురువారం హిమాయత్‌నగర్‌లోని వై జంక్షన్ ధర్నా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా పాల్గొన్న శ్రీనివాస్‌గౌడ్, రామకృష్ణ జివో నెంబర్లు 8, 9 ప్రతులను చించివేసి మాట్లాడారు. రాష్ట్రంలోని 14 లక్షల మంది విద్యార్థుల ఫీజుల రీయంబర్స్‌మెంట్ బకాయిల చెల్లింపులో ప్రభుత్వం జివోలు, కమిటీల పేరుతో కాలయాపన చేస్తూ విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్నదని ఆరోపించారు. ప్రభుత్వం ఫీజుల బకాయిలను చెల్లించకపోతే వారి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వారంరోజుల్లోగా విద్యార్థుల ఖాతాల్లో నిధులు జమచేసి, కళాశాలలకు చెల్లించకపోతే రెవిన్యూ రికవరీ (ఆర్‌ఆర్) చట్టం అమలు చేస్తారా?, వారిని బ్లాక్ లిస్ట్‌లో పెడతారా అని వారు ప్రశ్నించారు. అమాయకులైన విద్యార్థులపై జులం ప్రదర్శించడం, చిన్నచూపు చూడటం సరికాదన్నారు. స్కాలర్‌షిప్‌ల బకాయిల్లో కమిషన్లు రావని కారణంతో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని ఆరోపించారు. పెండింగ్‌లో ఉన్న పదివేల ఫీజుల రీయంబర్స్‌మెంట్ స్కాలర్‌షిప్‌ల బకాయిలను ప్రభుత్వం తక్షణమే చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని వారు హెచ్చరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర బిసి జెఎసి కో-ఆర్డినేటర్ గుజ్జ కృష్ణ, నాయకుడు ఉదయ్‌నేత తదితరులు పాల్గొన్నారు.



ధర్నాలో జివోల ప్రతులను చించివేస్తున్న వి.శ్రీనివాస్‌గౌడ్, వేముల రామకృష్ణ, గుజ్జ కృష్ణ తదితరులు

## లంబాడీ అధికారులపై కక్షపూరిత చర్యలు సహించం : డా. కరాటే రాజు నాయక్

**తార్నాక, జూన్ 11 ప్రభాతవార్త :** రాష్ట్రంలో లంబాడీ సమాజానికి చెందిన ఉన్నతాధికారులు, ఉద్యోగులపై వివక్ష పూరిత వైఖరి ప్రదర్శిస్తున్నారంటూ తెలంగాణ లంబాడీల ఆత్మగౌరవ వేదిక, ఓయూ జేఏసీ ఛైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు డా. కరాటే రాజు నాయక్ ఆరోపించారు. ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల వద్ద వివిధ గిరిజన, లంబాడీ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో నెహ్రూ నాయక్‌తో కలిసి ఆయన మాట్లాడుతూ అవినీతికి పాల్పడిన వారిపై చర్యలను వ్యతిరేకించడం లేదని, అయితే ఒకే వర్గానికి చెందిన అధికారులపై వరుసగా దాడులు జరగడం గిరిజన సమాజంలో ఆందోళనకు కారణమవుతోందన్నారు. తెలంగాణ ఉద్యమంలో లంబాడీ సమాజం కీలక పాత్ర పోషించిందని, పరిపాలన, విద్య, వైద్యం, ఇంజినీరింగ్, పోలీస్, రెవెన్యూ తదితర రంగాల్లో విశేష సేవలందించిన సమాజానికి గౌరవం, ప్రాధాన్యం దక్కాల్సి ఉండగా వివక్ష భావన పెరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. లంబాడీ సమాజానికి మంత్రి పదవి దక్కకపోవడం, గిరిజన సంక్షేమానికి తగిన ప్రాధాన్యం కల్పించకపోవడం, సమస్యలను నిర్లక్ష్యం చేయడం బాధాకరమన్నారు. గిరిజన సంక్షేమ హామీల అమలు, బడ్జెట్ కేటాయింపులు, ఉపాధి అవకాశాలు, రైతు సమస్యలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. గిరిజన ప్రజాప్రతినిధులు, లంబాడీ నాయకులు మౌనం వీడి సమాజ సమస్యలపై స్పందించాలని కోరారు. లంబాడీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే కుట్రలను ప్రజాస్వామ్య పద్ధతుల్లో తిప్పికొడతామని, అవసరమైతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమ కార్యాచరణ చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గిరిజన చైతన్య వేదిక ఓయూ జేఏసీ నాయకులు నెహ్రూ నాయక్, అల్ ఇండియా ట్రైబల్ జేఏసీ నాయకుడు రవీందర్ నాయక్, తెలంగాణ గిరిజన శక్తి వర్కింగ్ ప్రెసిడెంట్ సుబ్బు నాయక్, ప్రధాన కార్యదర్శి విజయ్ నాయక్, సురేష్ నాయక్, ధారావత్ సురేష్ నాయక్, నరేష్ నాయక్, భాస్కర్ నాయక్, గోపి నాయక్ తదితర గిరిజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.



ఓ.యూ ఆర్ట్స్ కాలేజ్ ఎదుట మాట్లాడుతున్న డా. కరాటే రాజు నాయక్

## వృత్తిదారుల సమస్యలపై జిల్లా కలెక్టర్‌కు వినతి



జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆలను కలిసి వినతి పత్రం, జ్ఞాపికను అందజేస్తున్న వృత్తిదారుల సంఘం ప్రతినిధులు

**చాంద్రాయణగుట్ట, జూన్ 11, ప్రభాతవార్త :** ఉమ్మడి దేవాలయాల వృత్తిదారుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆ సంఘం అధ్యక్షులు గట్టు సుదర్శన్ ఆధ్వర్యంలోని ప్రతినిధి బృందం గురువారం హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆలను కలిసి వినతి పత్రం అందజేశారు. శాలువ, జ్ఞాపికతో సన్మానించారు. అనంతరం గత కొన్నేళ్లుగా వృత్తిదారుల సమస్యలను వివరించారు. తరతరాలుగా గ్రామదేవతలకు పలు రకాల పూజలు నిర్వహించే ఆచారం, ప్రతి యేడు బోనాల పండుగ సమయంలో తలెత్తుతున్న ఇబ్బందులను పరిష్కరించాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో సంఘం వ్యవస్థాపక సలహాదారులు పేరోజి మహేశ్వర్, ప్రధాన కార్యదర్శి కొల్లూరు జ్ఞానేశ్వర్, కోశాధికారి బొమ్మరాజు రాజు, నాగిల కృష్ణ, బొమ్మరాజు దేవేందర్, పేరోజి ప్రదీప్ కుమార్, కొల్లూరు వెంకటేష్, బర్గల జగదీష్, చింతమల మల్లేష్, మల్కాజ్గిరి నరేష్, పేరోజి సురేందర్, పేరోజీ వీరేందర్ కుమార్ పాల్గొన్నారు.

## విద్యుత్ అంతరాయం కలుగకుండా చర్యలు తీసుకోవాలి



టిఎస్‌పిడిసిఎల్ బేగంబజార్ డి.ఇ కలిసిన బిఆర్ఎస్ నాయకులు మునుకుంట్ల

**గోషామహల్, జూన్ 11ప్రభాతవార్త:** వర్షాకాలం నేపథ్యంలో భాగంగా విద్యుత్ అంతరాయం కలుగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని గోషామహల్ నియాజకవర్గం బిఆర్ఎస్ నాయకులు మునుకుంట్ల ఆనంద్‌కుమార్‌గౌడ్ బేగంబజార్ ట్రాన్స్‌కో డి.ఇ అన్నయ్యకు వినతిపత్రం అందచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలోప్రారంభం కావడంతో ట్రి కట్టింగ్‌తోపాటు విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లు చుట్టూకంచె తదితర సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కోరారు. గోషామహల్ నియోజకవర్గంలో విద్యుత్ అంతరాయాలు కలుగకుండా అవసరమైన చర్యలు తీసుకోవడంతోపాటు వర్షాకాలంలో ఎలాంటి విద్యుత్ ప్రమాదాలు కాకుండా చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులను కోరారు.

## కంటోన్మెంట్ ఆర్టీసీ డిపో మేనేజర్‌గా కవిత బాధ్యతల స్వీకారం

**కంటోన్మెంట్, జూన్ 11 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కంటోన్మెంట్ డిపో నూతన డిపో మేనేజర్‌గా కే. కవిత గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు కంటోన్మెంట్ డిపో మేనేజర్‌గా విధులు నిర్వహించిన డి. సుధాకర్ రావు సంగారెడ్డి డిపో మేనేజర్‌గా బదిలీ కావడంతో, ఆయన స్థానంలో కే. కవిత బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా డిపోలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అధికారులు, సూపర్‌వైజర్లు, ఉద్యోగులు, కార్మికులు ఆమెకు ఘన స్వాగతం పలికి అభినందనలు తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం కే. కవిత మాట్లాడుతూ ప్రయాణికులకు సురక్షితమైన, సమయపాలనతో కూడిన, నాణ్యమైన రవాణా సేవలు అందించడమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. డిపో అభివృద్ధి, సంస్థ ఆదాయ వృద్ధి, ప్రయాణికుల సంతృప్తి, ఉద్యోగుల సహకారంతో మెరుగైన సేవల అందజేతకు కృషి చేస్తానని ఆమె తెలిపారు. ఆర్టీసీ సంస్థ అభివృద్ధికి ప్రతి ఉద్యోగి బాధ్యతాయుతంగా పనిచేయాలని, సమన్వయంతో ముందుకు సాగితే డిపోను అన్ని రంగాల్లో ఆదర్శవంతమైన డిపోగా తీర్చిదిద్దవచ్చని ఆమె అభిప్రాయపడ్డారు. సంస్థ నిర్దేశించిన లక్ష్యాల సాధనలో ఉద్యోగులందరి సహకారం అవసరమని కోరారు. ఈ కార్యక్రమంలో డిపోకు చెందిన అధికారులు, సిబ్బంది, ఉద్యోగులు పాల్గొని నూతన డిపో మేనేజర్ కే. కవితకు శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే బదిలీపై వెళ్తున్న డి. సుధాకర్ రావు అందించిన సేవలను కొనియాడుతూ ఆయనకు అభినందనలు తెలిపారు.

## నకిలీ కుల ధృవీకరణ పత్రాలపై చర్యలు తీసుకోవాలి

- విహెచ్ కు తెలంగాణ కాచి సంఘ్ వినతి



బిసి సంక్షేమ శాఖ ప్రభుత్వ సలహాదారు విహెచ్ కు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న తెలంగాణ కాచి సంఘం ప్రతినిధులు

**హైదరాబాద్, జూన్ 11 ( ప్రభాతవార్త ) :** రాజేంద్రనగర్ మండలం తహసీల్దార్ కార్యాలయం ద్వారా అక్రమంగా జారీ చేసిన నకిలీ వెనుకబడిన తరగతుల కుల ధృవీకరణ పత్రాల ను తక్షణమే రద్దు చేయాలని తెలంగాణ కాచి సంఘ్ డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం తెలంగాణ ప్రభుత్వ వెనుకబడిన తరగతుల సంక్షేమ ,అభివృద్ధి సలహాదారులు, మాజీ ఎంపీ వి. హనుమంతరావుకు సంఘం ప్రతినిధులు ఒక వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ కాచి సంఘ్ అధ్యక్షుడు ఎస్. బల్వీర్ సింగ్ మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ మండలంలో కొంతమంది వ్యక్తులు ఒక మోసపూరిత సంఘం ద్వారా తప్పుడు సమాచా రం అందించి ఖికాచిఖి మరియు కుష్వాహ కులాలను ఒకటిగా చిత్రీకరించారని మండిపడ్డారు. ఈ తప్పుడు ప్రాతిపదికన వారు అక్రమంగా బీసీ కుల ధృవీకరణ పత్రాలను పొందారని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వ బీసీ జాబితాలో గ్రూప్‌డి కింద సీరియల్ నంబర్ 13లో ఖికాచిఖి సంఘం గుర్తించబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. రిజర్వేషన్ల వ్యవస్థ యొక్క సమగ్రతను కాపాడటానికి, అర్హులకు న్యాయం చేయడానికి ప్రభుత్వం వెంటనే స్పందించాలని కోరారు. మోసపూరితంగా సర్టిఫికెట్లు పొందిన దరఖాస్తుదారులపై, వారికి సహకరించిన సదరు సొసైటీ నిర్వాహకులపై కఠినమైన చట్టపరమైన మరియు క్రిమినల్ చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో డిమాండ్ చేశారు.




ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న అసోసియేషన్ ప్రతినిధులు

## ఉద్యోగ నియామకాల్లో పారా క్రీడాకారులకు ప్రాధాన్యం ఇవ్వాలి

-ప్రభుత్వానికి పారా స్పోర్ట్స్ అసోసియేషన్ విజ్ఞప్తి

**హైదరాబాద్, జూన్ 11,ప్రభాతవార్త:** ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో పారా క్రీడాకారులకు ప్రాధాన్యం ఇవ్వాలని పారా స్పోర్ట్స్ అసోసియేషన్ తెలంగాణ అధ్యక్షుడు సింగారపు బాబు కోరారు. గురువారం సోమాజీగూడ ప్రెస్ క్లబ్లో అసోసియేషన్ సభ్యులతో కలిసి మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో జీవో నెం.74 అమలులో స్పష్టత లేకుండా భర్తీ చేస్తే పారా క్రీడాకారులకు తీవ్రమైన నష్టం వాటిల్లుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అంతర్జాతీయ స్థాయిలో క్రీడల్లో పాల్గొని వికలాంగులమైన మేము రాష్ట్ర , దేశ ప్రతిష్టను పెంపొందిస్తున్నామని ఈ సందర్భంగా గుర్తు చేశారు. తమలో చాలా మంది సివిల్ సర్వీస్ పరీక్షలు రాశామని, రోస్టర్ పాయింట్లు కేటాయించి నియామకాలను చేపడితే గ్రూప్ వన్ అధికారులు సైతం అయ్యే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం చేపట్టే అన్ని రకాల విభాగాలకు సంబంధించిన నియామకాల్లో ఖచ్చితంగా తమకు ప్రాధాన్యం ఇచ్చి న్యాయం చేయాలని కోరారు. సాధారణ క్రీడాకారులకు ఇచ్చే ప్రోత్సహకాలను వికలాంగ క్రీడాకారులకు సైతం ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో పార్యా స్పోర్ట్స్ అసోసియేషన్ సభ్యులు పీ. సంజీవయ్య, ఏ. సైదులు. మహేష్, ప్రశాంత్, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.



మేడ్చల్ రామలింగేశ్వర స్వామి ఆలయంలో పూజలు నిర్వహించిన బిజెపి నాయకులు

### ప్రధాని మోడీ దీర్ఘాయుష్షుతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలి

**మేడ్చల్, జూన్ 11, ప్రభాతవార్త :** దేశ ప్రధానిగా నరేంద్ర మోడీ 4399 రోజుల అత్యధికకాలం సేవలందించిన సందర్భంగా మేడ్చల్‌లోని శ్రీదాక్షాయణి సమేత రామలింగేశ్వర స్వామి ఆలయం లో మేడ్చల్ మున్సిపల్ బిజెపి అధ్యక్షురాలు శైలజ హరినాథ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ దీర్ఘాయుష్షుతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉండా లని నాయకులు పూజలు జరిపారు. అనంతరం శైలజ మాట్లాడుతూ నరేంద్ర మోడీ నేతృత్వంలో భారత దేశం మరింత శక్తివంతంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. 12 సంవత్సరాల సుపరిపాలన సందర్భంగా ప్రధానమంత్రికి అభినందనలు తెలిపారు. కార్యక్ర మంలో మేడ్చల్ రూరల్ జిల్లా బిజెపి ఉపాధ్యక్షుడు జగన్ గౌడ్, జిల్లా కోశాధికారి లవంగ శ్రీకాంత్, బీ.జె.వై.ఎం రాష్ట్ర నాయకుడు రాగం అర్జున్, మేడ్చల్ మున్సిపల్ బిజెపి ప్రధాన కార్యదర్శి కానుకంటి వంశీ విజయ్, ఉపాధ్యక్షులు మైసరి రాజు, సర్వేశ్వర రెడ్డి, కార్యదర్శి సాయి, నాయకులు థాత్రిక లక్ష్మణ్, శ్రీనివాస్ గౌడ్, చీర్ల సత్యనారాయణ, సత్యనారాయణ రెడ్డి, మహేష్ గౌలికర్, జకట బాబు రాజు తదితరులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన ధర్మన్నగూడ సర్పంచ్, వార్డు సభ్యులు, ఇతర పార్టీలో నాయక్ నాయకులు

### కాంగ్రెస్ పార్టీలోచేరిన ధర్మన్నగూడ సర్పంచ్

**యాచారం, జూన్ 11, ప్రభాతవార్త :**

కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం హయాంలోనే సబ్బండావర్గాల సమగ్ర అభివృద్ధి జరుగుతుందని ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి అన్నారు .ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం కావాలని మాజీ ప్రజాప్రతినిధులు, ప్రస్తుత సర్పంచుల ఏ పార్టీ వారి అయిన కాంగ్రెస్ పార్టీలో చేరుతామంటే చేర్చుకొని పార్టీతో పాటు గ్రామాల అభివృద్ధి చెందే విధంగా ప్రతి ఒక్క కాంగ్రెస్ కార్యకర్త సమిష్టిగా పనిచేయాలని స్థానిక ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి పిలుపునిచ్చారు.ప్రతి గ్రామాలలో కాంగ్రెస్ కార్యకర్తలు అందరూ ఒక్క తాటిపై ఉండాలని ,ఒకరికి ఒకరు అర్థం చేసుకొని పార్టీ అభివృద్ధి మన గ్రామ పాలన రాష్ట్ర అభివృద్ధి చెందాలంటే కార్యకర్త నుండి ముఖ్యమంత్రి వరకు పార్టీ నిబంధన లకు లోబడి ఉండి పార్టీ అభివృద్ధి కోసమే పని చేయాలని ప్రతి ఒక్కరికి గుర్తు చేశారు.రెండు గ్రూపుల్లో పార్టీకి నష్టం కలిగిస్తే అలాంటి వారిపై విచారణ చేసి పార్టీకి నష్టం కలిగించే వారిని ఒకటి రెండుసార్లు నచ్చజెప్పినా వినకుంటే పార్టీ నుంచి పూర్తిగా తొలగిస్తామని హెచ్చరించారు. గురువారం యాచారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మోటే శ్రీశైలం ఆధ్వర్యంలో నియోజక వర్గంలో చేస్తున్న పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై తొర్రూ రు క్యాంపు కార్యాలయంలో యాచారం మండలం ధర్మన్నగూడ గ్రామానికి చెందిన భారతీయ జనతా పార్టీ పార్టీ సర్పంచ్ పండుగ పద్మ బాల్ రాజ్‌లతో పాటు మరింత మంది కార్యకర్తలు నాయకులు. కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. అనంతరం కాంగ్రెస్ పార్టీలో చేరిన సర్పంచి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ సంక్షేమ ఫలాలను అభివృద్ధిని చూసే పార్టీలో చేరుతున్నానని అన్నారు. ధర్మన్నగూడ గ్రామంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం కోసం సమిష్టిగా సమన్వయంతో పని చేసి స్థానిక ఎమ్మెల్యే రంగారెడ్డి, పార్టీ ఆశయా లను నెరవేరుస్తానని తెలిపారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మోటే శ్రీశైలం మాట్లాడుతూ.. స్థానిక ఎమ్మెల్యే మల్ రంగారెడ్డి నాపై బాధ్యతలు అప్పగిస్తూ యాచారం మండలపార్టీ అధ్యక్షునిగా నియామకం చేయడం నాపై మరింత బాధ్యత పెరిగిందని అన్నారు.అట్టి బాధ్యతతోనే ప్రతి గ్రామంలోని వివిధ పార్టీలకు చెందిన సర్పంచులను వార్డు సభ్యులను కాంగ్రెస్ పార్టీలో చేర్పించే బాధ్యతలు తీసుకుంటున్నానని గుర్తు చేశారు. యాచారం మండలం సీనియర్ నాయకులు అందరూ పెద్దలు గౌరవనీయులు ప్రతి ఒక్కరూ నాకు వెన్నంటూ ఉండాలని కోరారు. ధర్మన్నగూడ గ్రామానికి రెండు కోట్ల 20 లక్షల నిధులు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. తులేకుర్ద్ ధర్మన్నగూడ గ్రామాల మధ్యలో గల బీట్ రోడ్డు కు కోటి 80 లక్షల నిధులు, 15 లక్షల అండర్ డ్రైనేజీ, 20 లక్షల సిసి రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో యాచారం మండల మాజీ ఎంపిపి రాచర్ల వెంకటేశ్వర్లు,వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్ రెడ్డి, ఏ.బ్లాక్ అధ్యక్షులు పాండు రంగారెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్. మస్కు నరసింహ, గడ్డ మల్లయ్య గూడ గ్రామ సర్పంచ్ అచ్చన మంగ, జంగయ్య,మాజీ ఎంపిటిసి మస్కు ఈశ్వర్, జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పోలమోని రామకృష్ణ యాదవ్, చింతుళ్ళ సీనియర్ నాయకులు కంకర్ల కృష్ణయ్య, రాజయ్య ధర్మాన గూడ గ్రామ శాఖ అధ్యక్షులు పెరుమాండ్ల సురేష్, ప్రధాన కార్యదర్శి అనుమాండ్ల శివ గ్రామస్తులు సీనియర్ నాయకులు సోమ అంజయ్య,బండ మల్లేష్,అనుమండ్ల కృష్ణ ,బండ చెన్నయ్య, బుర్రి జంగయ్య,చీమల జంగయ్య,బండ పెద్ద మల్లయ్య,గౌర కొమురయ్య, అచ్చన శ్రీశైలం,మండల బిక్షపతి, బుర్రి వెంకటేష్,కొంపోజు నరహరి గాజుల రవి గాజుల రజిని. మొండిగౌరెల్లి మాజీ వార్డ్ నెంబర్ ఎట్టి లక్ష్మయ్య. యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బండ శ్రీను క్యాషియర్ హనుమండ్ల శ్రీను (కవి), బుర్రి మురళి , బండ శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు

### రుద్రారం యంఆర్‌పిఎస్ గ్రామ కమిటి అధ్యక్షుడిగా ఎలిషప్ప

**పెద్దేముల్, జూన్ 11, ప్రభాతవార్త:** పెద్దేముల్ మండలం రుద్రారం యంఆర్‌పిఎస్ గ్రామకమిటి అధ్యక్షుడిగా ఎలిషప్ప ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని మండల ఇంచార్జ్ స్వామిదాసు తెలిపారు.

ఈ సందర్భంగా స్వామిదాసు మాట్లాడుతూ మందక్రిష్ణ మాదిగ ఉద్యమ కార్యచరణలో భాగంగా గోటు విలేజ్ కార్యక్రమంలో రుద్రారం గ్రామ యంఆర్‌పిఎస్ నూతన కమిటిని ఎన్నుకోవడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో యంఆర్‌పిఎస్ మండల నాయకులు ఆర్.నర్సిములు, గ్రామకమిటిసభ్యులు దస్థప్ప, ఈశ్వర్, రాములు, సిద్దప్ప, రత్నప్ప, ఈరప్ప, బాజరప్ప, అనంతప్ప తదితరులు పాల్గొన్నారు.



యంఆర్‌పిఎస్ నూతన కార్యవర్గం

# అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలి

**దుద్యాల్, జూన్ 11, ప్రభాతవార్త:** కొడంగల్ నియోజకవర్గం దుద్యాల్ మండల పరిధిలోని హకీంపేట్ నందు చేపడుతున్న ఎడ్యుకేషన్ హబ్ భవన నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలనీ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి సంబంధిత అధికారులను ఆదేశించారు.

గురువారము నాడు ఎడ్యుకేషన్ హబ్ లో ప్రతి ఒక సైట్ ను పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతి, నాణ్యత ప్రమాణాలు, మౌలిక వసతుల కల్పనపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డిగ్రీ కళాశాల, ఇంజనీరింగ్, మెడికల్, నర్సింగ్, కళాశాలలు, ఫిజియోథెరఫీ, వెటర్నరీ కళాశాల, యుంగ్ ఇండియా ఇంటి గ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులు వేగవంతంగా జరగాలని, నిర్మాణ పనులన్నియు నాణ్యతో ఉండాలని, ప్రతివారం నిర్ధారించిన లక్ష్యం మేరకు పనుల పురోగతి ఉండాలన్నారు. ప్రతి సైట్ కు సంబందించిన ప్లాన్ ను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిర్మాణ పనులను వేగవంతం చేసి పనులు పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులకు ఆదేశించారు.

ఎడ్యుకేషన్ హబ్ జిల్లా విద్యా రంగ అభివృద్ధికి కీలకంగా మారనుందని పేర్కొన్నారు. విద్యార్థులకు ఆధునిక విద్యా సదుపాయాలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ ప్రాజెక్టును చేపట్టిందని తెలిపారు. నిర్మాణ పనుల నాణ్యతలో ఎలాంటి రాజీ లేకుండా వేగవంతంగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్లు, అధికారులను ఆదేశించారు.



ఎడ్యుకేషన్ హబ్ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ దీపక్ తివారి

ఈ కార్యక్రమంలో కోడంగల్ కాడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి, తహసిల్దార్ కిషన్, నరసింహారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, చాకలి శ్రీనివాస్ ఇంజనీరింగ్ అధికారులు, సంబంధిత అధికారులు ఉన్నారు.

# కళ్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ



**కడ్తాల్, జూన్ 11, ప్రభాతవార్త :** పేదింటి ఆడబిడ్డలకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం గొప్ప వరమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. పేదింటి ఆడపిల్లలు కలిగిన తల్లిదండ్రులు పడుతున్న కష్టాలను రూపుమాపేందుకు కళ్యాణలక్ష్మి, షాదీమురక్ పథకాలతో ఎంతో లబ్ది చేకూరుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మండల కేంద్రంలో గురువారం ఎస్ ఎల్ ఆర్ గార్డెన్ లో తహసిల్దార్ జయశ్రీ అధ్యక్షతన ఏర్పాటు చేసిన చెక్కుల పంపిణీ కార్యక్రమానికి కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ముఖ్య అతిథులుగా విచ్చేసి కడ్తాల్, తలకొండపల్లి మండలాలకు చెందిన 180 మంది లబ్దిదారులకు మంజూరైన పేదింటి ఆడపడుచులకు ప్రజా ప్రతినిధులు అధికారులు నాయకులతో కలిసి లబ్దిదారులకు కళ్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ కార్యక్రమంలో అమనగల్ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ యాట గీత నరసింహ, వైస్ చైర్మన్ గుడురు భాస్కర్ రెడ్డి, గ్రామ సర్పంచ్ రాయికంటి బిక్షపతి, తహసిల్దార్ జయశ్రీ ఎంపిడిఓ సుజాత, టిపిసిసి సభ్యులు అయిళ్ళ శ్రీనివాస్ గౌడ్, సింగిల్ విండో డైరెక్టర్ చేగురి వెంకటేష్, డిసిసి అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు యాట నరసింహ, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బిచ్చనాయక్, టౌన్ అధ్యక్షులు మాలే మల్లేష్ గౌడ్,సర్పంచులు, అధికారులు, నాయకులు, లబ్ధిదారులు, పాల్గొన్నారు.

# క్రీడల్లో గెలుపోటములు సహజమే



దే డెవిల్స్ టీమ్‌కు బహుమతి అందజేస్తున్న నీరజా బాల్‌రెడ్డి

**పెద్దేముల్, జూన్ 11, ప్రభాతవార్త:**

క్రీడల్లో గెలుపోటములు సహజమేనని తాండూరు మునిసిపల్ చైర్‌పర్సన్ నీరజా బాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పెద్దేముల్ మండల కేంద్రంలో మాస్టర్ మైండ్ స్కూల్ డైరెక్టర్ ఉప్పరి మల్లేశం అధ్వర్యంలో నిర్వహించిన పీపీఎల్ క్రికెట్ టోర్నమెంటు ముగింపు కార్యక్రమానికి ఆమే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. క్రికెట్ టోర్నమెంటులో విన్నర్‌గా పెద్దేముల్ దే డెవిల్స్, రన్నర్‌గా పెద్దేముల్ స్ట్రైకర్స్‌కు బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ నీరజా బాల్‌రెడ్డి, కౌన్సిలర్ ఉప్పరి స్వరూప మల్లేశం మాట్లాడుతూ క్రీడలు యువతలో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, జట్టు స్ఫూర్తిని పెంపొందిస్తాయని అన్నారు.

విజేతలకు అభినందనలు తెలియజేస్తు, క్రీడల్లో పాల్గొన్న ప్రతి క్రీడాకారుడు విజేతేనని తాము భావిస్తున్నామని అన్నారు. క్రీడాకారులు భవిషత్తులో మరింత ఉన్నత స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో సర్పంచ్ డివై నర్సిములు, తహసిల్దార్ వెంకటేష్ ప్రసాద్, డిప్యుటి తహసిల్దార్ శ్రీనివాసులు, ఆర్ఐ చంద్రశేఖర్, టీపీసిసి కన్వీనర్ యండి.రియాజ్, కాంగ్రెస్‌పార్టీ జిల్లా ఉపాధ్యాక్షులు ఎల్లారెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పెండ్యాల ప్రవీన్ కుమార్ గుప్తా, ఉపసర్పంచ్ డివై ప్రసాద్, వ్యాపార వేత్త ఉప్పరి రవి, రవితేజ సాగర్, నిర్వహకులు సి.పాండు, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాల బస్సు డ్రైవర్‌కు కుక్క కాటు

**జంకుతున్న చిన్నారి విద్యార్థులు**

**వీధి కుక్కల బెడదపై చర్యలు తీసుకోవాలి: కౌన్సిలర్ సుధీర్**

**షాద్‌నగర్, జూన్ 11, ప్రభాతవార్త :** షాద్‌నగర్ పట్టణంలోని 8వ వార్డులో వీధి కుక్కల బెడద తీవ్రంగా ఉందని కౌన్సిలర్ బి.ఎస్. సుధీర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆక్స్‌ఫర్డ్ స్కూల్ సమీపంలో వీధి కుక్క దాడిలో మహేష్ అనే స్కూల్ బస్సు డ్రైవర్ తీవ్రంగా గాయపడిన ఘటనపై స్పందించిన ఆయన, వెంటనే చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్‌ను కోరారు.వీధి కుక్కలు గుంపులుగా తిరుగుతూ విద్యార్థులు, కాలనీ వాసులను భయాందోళనకు గురి చేస్తున్నాయని తెలిపారు. ప్రతిరోజూ పాఠశాలకు వెళ్లే చిన్నారులు కుక్కల కారణంగా భయపడుతున్నారని పేర్కొన్నారు. మున్సిపల్ కమిషనర్ సునీత రెడ్డి ఈ సమస్యపై ప్రత్యేక దృష్టి సారించి, వీధి కుక్కల నియంత్రణకు తక్షణ చర్యలు చేపట్టాలని కౌన్సిలర్ సుధీర్ కోరారు. ప్రజలకు, విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



బస్సు డ్రైవర్ ను కరిచిన కుక్క

### పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించాలి

**పెద్దేముల్, జూన్ 11, ప్రభాతవార్త:** తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించాలని పెద్దేముల్ జిల్లా పరిషత్ పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు ద్యావరి నరేందర్‌రెడ్డి అన్నారు. ప్రొఫేసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా గురువారం పెద్దేముల్ మండలం గోపాల్ పూర్‌లో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఉచిత విద్యతో పాటు పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, మధ్యాహ్న భోజనము, కంప్యూటర్ శిక్షణ, స్టూడెంట్ కిట్స్, స్కాలర్‌షిప్స్ తదితర పథకాలను అమలు చేయడం జరుగుతుందని అన్నారు. ప్రభుత్వ సహకారంలో ఉన్నత చదువులు చదివించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో యుపిఎస్ ప్రధానోపాధ్యాయులు ధనుంజయ షిండే, పెద్దేముల్ జడ్‌పిహెచ్‌ఎస్ ఉపాధ్యాయులు జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

### షాద్‌నగర్ ఆర్టీసీ డిపోకు నూతన డిఎంగా ఎం. కరుణశ్రీ

**షాద్‌నగర్, జూన్ 11, ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ షాద్‌నగర్ డిపో డీఎంగా పనిచేసిన ఉషా బదిలీపై జనగామ డిపోకు వెళ్లడంతో, షాద్‌నగర్ డిపోకు నూతన డిపో మేనేజర్‌గా ఎం. కరుణశ్రీ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఎం. కరుణశ్రీ గతంలో పరిగి, కామారెడ్డి, హైదరాబాద్2 డిపోల్లో డీఎంగా విధులు నిర్వహించారు. అనుభవజ్ఞులైన ఆమె షాద్‌నగర్ డిపో అభివృద్ధికి కృషి చేస్తారని సిబ్బంది ఆకాంక్షించారు. బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా డిపో సిబ్బంది నూతన డీఎం కరుణశ్రీకు ఘన స్వాగతం పలికారు.

### మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ పనులను పరిశీలించిన మున్సిపల్ చైర్మన్

**షాద్‌నగర్, జూన్ 11, ప్రభాతవార్త :** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ మున్సిపల్ పరిధిలోని పరిగి రోడ్డు అంబికా స్టీల్ షాప్ వద్ద జరుగుతున్న మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ మరమ్మతు పనులను మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ పరిశీలించారు. ఈ సందర్భంగా లీకేజీ సమస్యను త్వరితగతిన పరిష్కరించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సునీత రెడ్డి, కౌన్సిలర్ రాజు నాయక్, జమ్రుద్ ఖాన్, మున్సిపల్ అధికారులు సాయి కిరణ్, నరేష్, ఇలియాస్ తదితరులు పాల్గొన్నారు.



పైప్ లైన్ లీకేజీ పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్

### విజ్ఞాన్ జూనియర్ కళాశాలలో ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాల్లో విజయభేరి

**షాద్‌నగర్, జూన్ 11, ప్రభాతవార్త :** తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డు ప్రకటించిన అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాల్లో షాద్‌నగర్‌లోని విజ్ఞాన్ జూనియర్ కళాశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. కళాశాల ప్రిన్సిపాల్ డి.వి. శ్వేత్ వెల్లడించిన వివరాల ప్రకారం పలు విభాగాల్లో విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించారు. ఎంపీసీ విభాగంలో ఆశుతోష్ ఝా – 468/470 మార్కులు బైపీసీ విభాగంలో: అఫ్సానా – 437/440 మార్కులు సీఈసీ విభాగంలో:ఫాతిమా ఖానం – 492/500 మార్కులు ఎంఈసి విభాగంలో: జోహా ఫాతిమా – 493/500 మార్కులు సాధించి కళాశాలకు పేరు తీసుకొచ్చారు. అలాగే ఎంపీసీలో కీర్తి స్నేహ – 467, జ్యోతిర్మయి ఫాతిమా – 467, కె.రోజా – 467 మార్కులు, బైపిసిలో వి.విశాల్ – 433, అఫ్రిన్ – 432, సిఈసిలో చందన – 490, ఎంఈసిలో కె.స్నేహ – 478 మార్కులు సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను, వారికి మార్గనిర్దేశం చేసిన అధ్యాపకులను కళాశాల యాజమాన్యం అభినందించింది. భవిష్యత్తులో విద్యార్థులు మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

### యాచారంలో మేస్త్రీల సమ్మె

**యాచారం, జూన్ 11, ప్రభాతవార్త:**

యాచారం మండల పరిధిలోని 20 గ్రామపంచాయతీలను మేస్త్రీలు తమ వేతనాలు ధరలు పెంచాలని సమ్మె నిర్వహిస్తున్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గం లోని సుమారు అన్ని గ్రామాలను ఇదే పరిస్థితి ఉందని గ్రామాలలో వారి సంఘాలుగా నిర్మాణ పనులను నిలిపివేయించారు. గతంలో సెంట్రింగ్ ధరలు పెరిగాయని మేస్త్రీల ధరలు పెరగలేదని సెంట్రింగ్ కు అనుగుణంగా మేస్త్రీ కూలీలకు చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నిబంధనలు అనుగుణంగా నిర్మాణ కార్మికులకు న్యాయం జరగాలని కోరారు.

### ఆర్మీ ఉద్యోగం సాధించిన యువకుడికి సన్మానం

**కొడంగల్ రూరల్, జూన్ 11, (ప్రభాతవార్త):** ఆర్మీ ఉద్యోగం సాధించిన యువకుడిని సన్మానించారు. రేగడిమైలారం గ్రామానికి చెందిన ఉప్పరి శ్రీకాంత్ 2022 బ్యాచ్ పదోతరగతి కొడంగల్ పట్టణంలోని నవీన ఆదర్శ ఉన్నత పాఠశాలలో పూర్తి చేశాడు. ఇటీవల నిర్వహించిన అగ్ని వీర్‌లో ఆర్మీ ఉద్యోగం సాధించాడు. ఈ సంద ర్భంగా పాఠశాల వ్యవస్థాపకులు డి.లక్ష్మి వెంకటయ్య, ప్రిన్సిపాల్ డి.వి.నరేశ్‌రాజ్, వైస్ ప్రిన్సిపాల్ సంతోష, ఉపాధ్యాయులు శ్రీకాంత్‌ను శాలువాలతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పాఠశాలలో విద్యను అభ్యసించిన ఎంతో మంది పూర్వ విద్యార్థులు వివిధ రంగాల్లో ఉద్యోగాలు చేస్తూ ఉన్నత స్థానాల్లో ఉన్నారని తెలిపారు.



రైతులకు విత్తనాలను పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ తదితరులు

### రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

**కొడంగల్,జూన్ 11,ప్రభాతవార్త :**

రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని మున్సిపల్ చైర్మేన్ నందారం ప్రశాంత్,మార్కెట్ కమిటీ చైర్మేన్ అంబయ్యగౌడ్,పీఏసీఎస్ అద్యక్షులు కట్కం శివకుమార్ గుప్త అన్నారు.రైతుల ఆర్దికాభివృద్ది వ్యవసాయ ఉత్పాదకత పెంపు లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లో భాగంగా గురువారం కొడంగల్ వ్యవసాయ శాఖ కార్యాలయంలో కందుల విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన మున్సిపల్ చైర్మేన్ నందారం ప్రశాంత్ మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేయడానికి ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తున్నదని తెలిపారు.ప్రభుత్వం అందిస్తున్న కంది విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకొని అధిక దిగుబడులు సాధించాలని అన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మేన్ అంబయ్యగౌడ్ మాట్లాడుతూ రైతుల అభివృద్దే గ్రామీణ ఆర్దిక వ్యవస్థకు బలమని అన్నారు.రైతులకు నాణ్యమైన విత్తనాలు,ఎరువులు,సాంకేతిక సలహాలు అందించడం ద్వారా వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.రైతులు ఆధునిక సాగు పద్దతులను అవలంబిస్తు ఆదాయాన్ని పెంచుకోవాలని పేర్కొన్నారు.రైతులకు అవసరమైన అన్ని రకాల సహకారం సేవలను అందించేందుకు సహకార సంఘాలు ఎల్లప్పుడు సిద్దంగా ఉంటాయని పిఏసిఎస్ అధ్యక్షులు కట్కం శివకుమార్‌గుప్త అన్నారు.అనంతరం రైతులకు కంది విత్తనాలను పంపిణీ చేశారు.కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు శంకర్ రాథోడ్.మండల వ్యవసాయ అధికారి శ్రీలత,ఎస్సై జీవీ.సత్యనారాయణ,వివిధ గ్రామాల సర్పంచ్‌లు,నాయకులు కన్నం శ్రీనివాస్‌రెడ్డి,సంతోష్,తార్యానాయక్,సూరి తదితరులు పాల్గొన్నారు.

### హకీంపేట్ గ్రామ సమగ్ర అభివృద్ధికి కృషి

**-రూ.1.40 కోట్ల పనులకు భూమి పూజ..**

**దుద్యాల్, జూన్ 11, ప్రభాతవార్త:** అన్ని కులాల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని హకీంపేట్ సర్పంచ్ రవీంద్ర నరసింహారెడ్డి తెలిపారు. గ్రామంలో యాదవ, ముదిరాజ్, ఎస్సీ, నాయి బ్రాహ్మణ, చేనేత కమ్యూనిటీ భవనాల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ కమ్యూనిటీ భవనాలను కోటి నలభై లక్షల నిధులతో నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. గ్రామానికి 5 ఐమాక్స్ లైట్లు మంజూరు అయినట్లు తెలిపారు. గ్రామ సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ రవీంద్ర నరసింహారెడ్డి తో పాటు ఉపసర్పంచ్ మహేష్ కుమార్, శ్రీనివాస్ రెడ్డి, చాకలి శ్రీనివాస్, వివిధ కమ్యూనిటీలకు చెందిన నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



భూమి పూజ చేస్తున్న ప్రజా ప్రతినిధులు, నాయకులు..

### అర్హులందరికి సంక్షేమ పథకాలు

**కడా ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి**

**కొడంగల్,జూన్ 11,ప్రభాతవార్త:** అర్హులందరికి సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని కడా ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి అన్నారు.గురువారం స్దానిక తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ రాంబాబు అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హాజరైన కడా ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి 32 మంది లబ్దిదారులకు కళ్యాణలక్ష్మీ,షాదీముబారక్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదింటి అడబిడ్డల పెళ్ళిలకు కళ్యాణలక్ష్మీ అసరాగా నిలుస్తుందన్నారు.అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందంచడం జరుగుతుందని పేర్కొన్నారు.కార్యక్రమంలో మున్సిపల్ చైర్మేన్ నందారం ప్రశాంత్,మున్సిపల్ కౌన్సిలర్ హమీద్,కోఆప్షన్ సభ్యులు రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

### వికలాంగులకు ఉపాధి అవకాశాలే లక్ష్యంగా శిక్షణ

**కొడంగల్,జూన్ 11,ప్రభాతవార్త:** వికలాంగులకు ఉపాధి అవకాశాలు కల్పించడం ద్వారా వారిని ఆర్దికంగా స్వావలంభన దిశగా నడిపించవచ్చని మున్సిపల్ చైర్మేన్ నందారం ప్రశాంత్ అన్నారు.కొడంగల్‌లోని ఎస్బీఐ ఆర్‌ఎస్‌ఈటీఐ గ్రామీణ ఉపాధి శిక్షణా సంస్ద అద్వర్యంలో వికలాంగుల కోసం నిర్వమించిన ఆరు రోజుల ప్రత్యేక శిక్షణ కార్యక్రమం ముగింపు సందర్భంగా గురువారం వారికి దృవపత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికలాంగులు తమలోని ప్రతిభను గుర్తించి,ప్రభుత్వం,వివిధ సంస్దలు అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. వికలాంగులను సమాజంలో వెనుకబడిన వారిలా కాకుండా ప్రత్యేక ప్రతిబ కలిగిన వ్యక్తులుగా గుర్తించి వారికి అన్ని రంగాల్లో ప్రోత్సాహం అందించాల్సిన అవసరం ఉందన్నారు.ప్రస్తుతం ప్రభుత్వంతో పాటు బ్యాంకింగ్ సంస్దలు, స్వచ్చంధ సంస్దలు వికలాంగుల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నాయని,వాటి ద్వారా స్వయం ఉపాధి రంగంలో ముందుకు సాగేందుకు మంచి అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. శిక్షణ ద్వారా పొందిన నైపుణ్యాలను ఉపయోగించి స్వయం ఉపాధి యూనిట్లు స్దాపించడంతో పాటు కుటుంబ ఆర్దిక స్దితిని మెరుగు పర్చుకోవచ్చని తెలిపారు.కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మేన్ అంబయ్యగౌడ్,పీఏసీఎస్ అద్యక్షులు కట్కం శివకుమార్‌గుప్త,ఎస్సై జీవీ,సత్యనారాయణ,ఏపీఓ గోపాల్,వికలాంగుల సమాఖ్య అద్యక్షురాలు మోనమ్మ,కమిట్‌మెంట్ సంస్ద నియోజకవర్గ కోఆర్డీనేటర్ దస్తప్ప తదితరులు పాల్గొన్నారు.

PUBLIC NOTICE

General Public is hereby informed that my client is intending to enter into sale transaction with Sri. Ujwal Jain S/o Mittalal Jain R/o H.No. 1262/63, Pioneer Bazar, near Sadhana Mandir School, Secunderabad for purchase of Open Place admeasuring 1570 Sq. yards or 1312.52 Sq. meters, situated in Sy. No. 14/A/2/1/1, Chinna parvathapur village, Mudu chinthalapally Mandal, Medchal-Malkajgiri District, Telangana and bounded by North: Open Place of S. Srisailam and others, South: 100 Feet Wide Road (Potharam to MC Pally), East: Open Place in part of Sy. No. 14, West: 40 Feet Wide Road, for a valuable sale consideration.

Any person or persons have any objection or objections, kindly contact the undersigned within seven days from date of this publication. Thereafter, no objections will be entertained, and my client will conclude the sale transaction by getting registered Sale Deed in his favour.

Sd/-VENKATESH DESHPANDE
Advocate,
2-1-514/4/1, Nallakunta,
Hyderabad-500044
PH.9246546840

PUBLIC NOTICE

General Public is hereby informed that my client is intending to enter into sale transaction with Smt. Chavva Shailaja W/o Chavva Satish Kumar R/o H.No. 10-2-309, Plot No. 188, Sudha Vaishnavi Residency, Street No. 4, Road No.7, West Marredpally, Nehrunagar Park, Secunderabad for purchase of agricultural Land Admeasuring Ac 0.20 Guntas, situated in Sy. No. 82/1/A/1/1/2/1/1, of Mudu chinthalapally Village and Mandal, Medchal- Malkajgiri District, Telangana and bounded by North: Land of Srinivas Rao and others, South: Neighbour's Land East: Neighbour's Land and Main Road from Muduchinthalapally to Uddamarri, West: Land of Srinivas Rao and others, for a valuable sale consideration.

Any person or persons have any objection or objections, kindly contact the undersigned within seven days from date of this publication. Thereafter, no objections will be entertained, and my client will conclude the sale transaction by getting registered Sale Deed in his favour.

Sd/-VENKATESH DESHPANDE
Advocate,
2-1-514/4/1, Nallakunta,
Hyderabad-500044
PH.9246546840

## మంచినీటి సరఫరాకు ప్రత్యేకశ్రద్ధ

పూడూరు, జూన్ 11, ప్రభాతవార్త : గ్రామంలో మంచినీటి సరఫరాకు ప్రత్యేకశ్రద్ధ తీసుకుంటున్నట్లు సర్పంచ్ టి.దయాకర్ పేర్కొన్నారు. గురువారం పూడూరు మండలం పరిధిలోని ఎన్కెపల్లి గ్రామంలోని 1వవార్డులో గ్రామపంచాయతీ నిధులతో నూతనంగా బోరుబావిని తవ్విం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీవాసుల త్రాగునీటిని దృష్టిలో ఉంచుకొని మంచినీటి కొరత లేకుండా తగు జాగ్రత్తల నిమిత్తం కొత్తగా వేయించిన బోరుబావిలో సరిపడా నీరు రావడం గ్రామస్తుల అదృష్టంగా భావించాలని వివరించారు. దీంతో గ్రామంలో మంచినీటి కొరత లేకుండా తగుచర్యలు తీసుకుంటామన్నారు. మరుగునీటి కాలువల పరిశుభ్రతతోపాటు పాడైన అంతర్గత సిసి రోడ్ల మరమత్తులపై దృష్టి పెట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ విజయ్, పంచాయతీ సభ్యులు కిష్టం రవి గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



పూడూరు మండలం ఎన్కెపల్లి గ్రామంలో బోరుబావికి భూమిపూజ చేస్తున్న సర్పంచ్ దయాకర్ తదితరులు

## నిరుపేద కుటుంబాలకు అండగా ఉంటాం

**బ్లాక్ బి అధ్యక్షులు భరత్ కుమార్**

**కుల్కచర్ల, జూన్ 10 ప్రభాతవార్త:** నిరుపేద కుటుంబాలకు అండగా ఉంటామని బ్లాక్ బి అధ్యక్షులు భరత్ కుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రదనికి చెందిన బైండ్ల బుడ్డయ్య మృతి చెందడంతో విషయం తెలుసుకున్నబ్లాక్ బి అధ్యక్షులు భరత్ కుమార్ మృతుడి బైండ్ల బుడ్డయ్య కుటుంబాని పరామర్శించి అంత్యక్రియల నిమిత్తం 3వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా బ్లాక్ బి అధ్యక్షులు భరత్ కుమార్ మాట్లాడుతూ.. నిరుపేద కుటుంబాలకు అండగా ఉంటామన్నారు. పేదలను అదుకోవడమే తన లక్ష్యమన్నారు. ఎల్లయ్య నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి గ్రామ పంచాయతీలో మహిళా భవనం ఉండాలి

**డిసిసి జిల్లా ఉపాధ్యక్షులు భీంరెడ్డి**

**కుల్కచర్ల, జూన్ 10, ప్రభాతవార్త:** ప్రతి గ్రామ పంచాయతీలో మహిళ భవనం ఉండేందుకు పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి సంకల్పమని డిసిసి జిల్లా ఉపాధ్యక్షులు భీంరెడ్డి, మండల అధ్యక్షులు గోపాల్ నాయక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఆయా గ్రామాల మహిళ భవన నిర్మాణం ప్రొసిడింగ్ ను ఆయా గ్రామల సర్పంచులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వంలో కోటి మహిళలను కోటిశ్వరులనుచేయడమే లక్ష్యంగా ఉందన్నారు. మహిళల కోసం అనే సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

## మొరంగపల్లిలో "ఖేతి బచావో అభియాన్"



రైతులకు కేతిబచావో అభియాన్ కార్యక్రమంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న కేంద్ర వ్యవసాయశాఖ అధికారులు, పాల్గొన్న రైతులు.

**మోమిన్‌పేట్, జూన్ 11. ప్రభాతవార్త:** మోమిన్పఏట్ మండల కేంద్రంలోని మొరంగపల్లి గ్రామంలో కేంద్రీయ సమగ్ర సస్యరక్షణ కేంద్రం హైదరాబాద్ వారి ఆద్వర్యంలో "కేతి బచావో అభియాన్" కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సీఐపిఎంసి ఇంచార్జి వెంకట్‌రెడ్డి మాట్లాడుతు కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి ప్రారంభించిన కేతిబచావో అభియాన్ కార్యక్రమాన్ని ఉద్దేశాన్ని వివరించి మట్టిపరిక్ష, పంటమార్పిడి చేసి రసాయన ఎరువులు తగ్గించి భూసారాన్ని కాపాడాలని తెలిపారు. ప్లాంట్ ప్రొటెక్షన్ అధికారి హొన్నప్ప మాట్లాడుతు విత్తనశుద్ది ఉపయోగాల గురించి చెబుతూ ప్రత్యక్షంగా డెమో ప్రదర్శించి వివరించారు. అసిస్టెంట్ ప్లాంట్ ప్రొటెక్షన్ అధికారి ఉదయశంకర్ మాట్లాడుతు పురుగుల మందులు పిచకారి చేసేటప్పుడు, కొనేటప్పుడు, వాడిన తర్వాత పాటించవలసిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. మండల వ్యవసాయశాఖ అధికారి రామకృష్ణారెడ్డి మాట్లాడుతు రైతులు రసాయన ఎరువులు తగ్గించి భూసారాన్ని కాపాడే జనుము, జిలుగ వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ అరుణ బిచ్చయ్య, వ్యవసాయ విస్తరణ అధికారి స్వాతి, పెంటయ్య, పంచాయతి కార్యధర్శి రాణి, రైతులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## కండ్లకోయలో బొడ్డురాయి వార్షికోత్సవాలు



కండ్లకోయలో బొడ్డురాయికి పూజలు నిర్వహిస్తున్న గ్రామస్తులు

**మేడ్చల్, జూన్ 11, ప్రభాతవార్త :** గుండ్లపోచంపల్లి డివిజన్ పరిధిలోని కండ్లకోయ గ్రామంలో బొడ్డురాయి 3వ వార్షికోత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు, నాయకులు బొడ్డురాయికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరేందర్‌రెడ్డి, హంసరాణి, కృష్ణ గౌడ్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## కల్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

**దౌల్తాబాద్, జూన్ 11, ప్రభాతవార్త:**

దౌల్తాబాద్ మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో గురువారంరోజు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు కలిసి పంపిణీ చేశారు. మండల వ్యాప్తంగా 96 మంది లబ్ధిదారులకు ఈ ఆర్థిక సాయం చెక్కులను అందజేశారు. ఈ సంధర్భంగా నాయకులు, అధికారులు మాట్లాడుతూ.. పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు ఆర్థిక భారం కాకూడదనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఈ పథకాలను అమలు చేస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో దౌల్తాబాద్ తహసీల్దార్ వెంకటస్వామి, డిప్యూటీ తహసీల్దార్ వెంకటచారి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వెంకట్రావు, జిల్లా ఉపాధ్యాక్షులు బోడి వెంకట్‌రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు, స్థానిక నాయకులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేస్తున్న అధికారులు,నాయకులు

# నిర్ధావెల్లి శ్రీవారి ఆలయంలో మహా కుంభాభిషేక శోభ

**-మొదలైన ఆరంభ సన్నాహకాల పూజలు**

**కేశంపేట, జూన్ 11, ప్రభాతవార్త :** కేశంపేట మండల పరిధిలో గల నిర్ధావెల్లి గ్రామంలో వెలసిన శ్రీలక్ష్మీ ౣ వెంకటేశ్వర స్వామి ఆలయం కేశం పేట మండలంలోనే అత్యంత ప్రాచీన ఆలయం. ఈ ఆలయానికి వందల సంవత్సరాల చరిత్ర కలిగి ఉంది. ఈ గ్రామానికి రెండు సరిహద్దులలో ఒకవైపు శివాలయం మరోవైపు వెంకటేశ్వరాలయం ఉండడం విశేషం. పూర్వం, ఈ గ్రామం రెండు గ్రామాల కూడలి. గోసాయిల కాలానికి రెండు గ్రామాలను ఒకటిగా చేసిన నాటి అధికారి శ్యామ్ రావు బహద్దూరు వారి ఆధ్వర్యంలో దేశానికి స్వతంత్రం వచ్చిన సందర్భంగా ఈ ఆలయంలో పూర్వం నిర్వహణలో ఉన్న బ్రహ్మోత్సవాలను 1947 నుండి ప్రారంభం చేసినట్లు చరిత్ర తెలియచేస్తున్నది. ఈ ఉత్సవాలు ప్రారంభం అయ్యి నేటికి ఎనభై సంవత్సరాల కాలం కావడంలో ఆలయ నిర్వాహకులు గ్రామ సర్పంచి భాస్కర్ గౌడ్‌తో కలిసి ప్రముఖ ఆగమ, ధర్మ శాస్త్ర పండితులు , సుప్రసిద్ధులు అయిన ఆచార్య కాకునూరి సూర్యనారాయణ మూర్తిని గురువారం సంప్రదించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని వారు ఆల యానికి పూర్వ వైభవం రావడం కోసం కొన్ని సూచనలు చేశారు. ఆలయ జీర్ణోద్ధార కార్యక్రమాలు చేపట్టడం , మూలవిరాట్టుకు అష్టదిగ్బంధనం, సుదర్శన మహాయాగం, షోడశ కళా మహాన్యాసంతో పాటు మహా కుంభాభిషేకం తదితర వైదిక ప్రక్రియలు నిర్వహించాలి అని పలు రకాల సూచనలు తెలియచేశారు. కాకునూరి, నిడుదవెల్లి గ్రామానికి చెందిన బ్రహ్మ లీనులు కీ. శే. వెంకట రమణ శాస్త్రీ (కాకునూరి వెంకటరమణ శాస్త్రీ పెద్ద కుమారులు కావడం ఒక విశేషం.

**చరిత్ర:**

లక్ష్మీ ౣ వెంకటేశ్వర ఆలయం స్వయం వ్యక్త అర్చా మూర్తి కావడం ఒక అద్భుతమైన విశేషం. నాటి పండితులు, బ్రహ్మశ్రీ పడకల్లు నారాయణ, దేవునిపడకల్లు కృష్ణమాచార్యులు, వెలిజాల నారాయణ, గంగాపురం నరసింహ శాస్త్రీ ,ఖండవల్లి నరసింహ శాస్త్రీ, కేశవపంతుల



సుప్రసిద్ధులు అయిన ఆచార్య కాకునూరి సూర్యనారాయణ మూర్తితో ఆలయ నిర్వాహకులు, సర్పంచి భాస్కర్ గౌడ్ ,పండితులు

నరసింహ శాస్త్రీ, ఎక్ లాస్ కం పేట్ రామావధాని, గోవిందాచార్యులు ఇంకా అనేకులు ఈ బ్రహ్మోత్సవ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. హిందూ ముస్లిం ఐక్యత కు ప్రతీకగా ఒక.ముస్లిం కూడా ఆలయ నిర్వహణలో బాధ్యత స్వీకరించినట్టు అతడి పేరు మహమ్మదు బుర్హానుద్దీను అని, అన్ని కులాలవారికి స్వామి సేవలో భాగం కల్పించే విధంగా సూరమోని సాయిలు, బోడ రంగయ్య, జంగం వీరయ్య, గుబ్బ రాజయ్య మొదలైన వారంతాసభ్యులు కావడం నాటి విశేషం. 1952 వ సం.లో నాటి హైదరాబాదు రాష్ట్ర ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు , ప్రజాసేవకులు మాడపాటి హనుమంతరావు గార్లు వచ్చేసి ఆలయంలో , ధ్వజస్తంభం ,ముఖమండప నిర్మాణాలను ప్రారంభినట్టు చరిత్ర చెబుతున్నది. బూర్గుల రామకృష్ణారావు చారిత్రక పరిశోధన వ్యాసం వల్లనే సుప్రసిద్ధ వ్యాకరణ వేత్త కాకునూరి అప్పకవి ఈ ప్రాంతం వాడని నిర్ధారణ అయిన విషయం మనకు తెలిసిందే. వారి గ్రంథం అప్పకవీయంలో నిర్ధావెల్లి , నవదలపురి ఇదే నేటి తొమ్మిది రేకుల, లేమామిడి, బోదునంపల్లి, కాకునూరు, గ్రామాల ప్రస్తావన అవతారికలో ఉంది. ఈ గ్రామాలలో వ్యవసాయ క్షేత్రాలను నాటి గద్వాల, వనపర్తి సంస్థాన జమీందారులు వారికి ఇచ్చినట్టు, కాకునూరి వంశీకుల చరిత్ర చెబుతుంది. నేడు నర్లా వంశీకులు దత్తతల పరంపరలో, ఖిషరికాల పేరుతో నేటికీ మండలంలోని కొన్ని గ్రామాలలో ఆలయ భూములు ఉన్నాయి ఈ గ్రామాలలో వ్యవసాయ భూములు కలిగి, గ్రామాల పౌరోహిత్యం నిర్వహిస్తున్నారు. కీ.శే. బ్రహ్మశ్రీ యజ్ఞనారాయణ , వారి కుమారులు హరి బాబు శర్మ, విజయకుమార శర్మలు ప్రస్తుతం నిర్ధావెల్లి కి చెందినవారు కాగా ప్రముఖ పండితులు కాకునూరి సూర్యనారాయణ మూర్తి . వారి సోదరుడు రవినారాయణ మూర్తి ప్రస్తుతం కాకునూరు వాస్తవ్యులు గా ఉన్నారు. ఆలయంలో పాంచరాత్ర ఆగమోక్త ప్రకారంగా పంచాహ్నిక దీక్షలో నేటికీ నాటి సంప్రదాయాన్ని కేశవరం కుటుంబీకులు సశాస్త్రీయంగా నిర్వహిస్తున్నారు. వ్యవస్థాపక ధర్మకర్తలుగా , కేశవరం గోదావరి వెంకటరావు, హనుమంతరావు , పురుషోత్తమ రావు , రామ మోహన రావు మురళీ మోహన రావు ఉండగా , కార్యకర్తలు గా గ్రామస్తులు, గ్రామ సర్పంచి చేసురువెల్లి భాస్కర్ గౌడ్ ఆధ్వర్యంలో ఆలయ ఉత్సవాలు ఇతర కార్యక్రమాలు ప్రస్తుతం జరుగుతున్నాయి.

**భావి కార్యక్రమం:** ప్రస్తుతం గ్రామ సర్పంచ్ భాస్కర్ గౌడ్ నేతృత్వంలో , ఆలయ కమిటీ చైర్మన్ గా చిలువేరి చంద్రయ్య, ఇతర సభ్యులుగా పల్నాటి కృష్ణయ్య, సూరమోని సత్యనారాయణ, మద్దెల శేఖర్, బోడ మల్లేష్, కమ్మరి రవి , ఖాజా బాషా తదితరులు ఆచార్య సూర్యనారాయణ మూర్తిని కలిసి తమ ఆలయానికి విచ్చేసి , ప్రత్యక్షంగా పరిశీలించి ,ఆలయంలో చేపట్టవలసిన పురుషోత్తమ బ్రహ్మోత్సవ కార్యక్రమాలను ఆచరించే విధానాలను తెలియచేయవలసిందిగా అభ్యర్థించగా, వారు అంగీకరించారు. రాబోయే యనభైయ్యవ పురుషోత్తమ బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించాలని , దేవుడి పల్లకికి నలుగురు బోయిలు ఉంటారు. నా దేవుడు అనకుండా మనదేవుడు అనాలి అందరూ కలిస్తేనే ఆలయ నిర్వహణ అని, అందరి సహకారం ఉండాలి అని గ్రామ సర్పంచ్ చేతులవల్లి భాస్కర్ గౌడ్ గ్రామస్తులు ఆలయ కమిటీ సిబ్బంది పిలుపునిచ్చారు.

# ధాన్యం కొనుగోలులో జాప్యం చేయరాదు



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతు సంఘం నాయకులు

**వికారాబాద్, ప్రభాతవార్త :** వరి ధాన్యం కొనుగోలులో జాప్యం చేయకుండా వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ అదనపు కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్ కు రైతు సంఘం నాయకులు గురువారి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా కార్యదర్శి గంటి సురేష్ కుమార్

మాట్లాడుతూ, వరి ధాన్యం అమ్మబోతే రైతులకు అష్ట కష్టాలు తప్పుండంలేదని, ధాన్యం కొనుగోళ్లలో తీవ్ర జాప్యంతో రైతులు నెలల తరబడి కొనుగోలు కేంద్రాలలో పడిగాపులు కాస్తూ నరకయాతన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తూకం కోసం కుప్పలు పోసిన రాసుల్లోనే ధాన్యం మొలకెత్తుతుందని ధాన్యం కొనుగోలు మందకోడిగా సాగడంతో రెండు నెలలుగా ధాన్యం దగ్గరే రైతులు పడిగాపులు కాయవలసి వస్తుందని అన్నారు. దీంతో వర్షాకాలం వ్యవసాయ పనులు కుంటుపడుతున్నాయన్నారు, నిత్యం వర్షాలు పడడంతో ఆరబెట్టడం, కుప్పలు చేయడం కోసం అదనపు వ్యయప్రయాసాలు పడుతున్నారన్నారని అన్నారు. నిబంధన ప్రకారం ధాన్యం కొనుగోలు చేసే సమయంలో బస్తాకు 41 కిలోల 500 గ్రాములు తూకం ఉండాలి, కానీ ధాన్యం తూకం సమయంలోనే అనేక కారణాలను చూపుతూ మూడు నుంచి నాలుగు కిలోల వరి ధాన్యాన్ని అదనంగా తీస్తూ రైతులను నిలువున ముంచుతున్నారన్నారు. రైతులు పండించిన పంటకు లాభం లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఐకెపి సెంటర్ల నుండి రైస్ మిల్లులకు వరి ధాన్యాన్ని తరలించేందుకు రైతులే రవాణా చార్జీలు భరించడంతో పండించిన పంట రవాణా చార్జీలకే వెచ్చించవలసి వస్తుందన్నారు. రవాణా చార్జీలు రైతులపై వేయకుండా రవాణా చార్జీలను రైతులకు అందించాలన్నారు. సంబంధిత శాఖ అధికారులు స్పంధించి రైతులకు ఇబ్బందులు కలుగకుండా ధాన్యం త్వరితగతిన కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు హనుమంతు, ఆచారి, బుగ్గప్ప, నర్సింలు, అనంతయ్య, సాయప్ప విమలమ్మ, సావిత్రమ్మ, బాబు, తదితరులు పాల్గొన్నారు.



రావిర్యాల గ్రామంలో అంతర్గత మురుగు కాలువ పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ నీలయ్య

## మురుగు కాలువ పనులు ప్రారంభం

**జిల్లెడు చౌదరిగూడ, జూన్ 11,(ప్రభాతవార్త):** జిల్లెడు చౌదరిగూడ మండలంలోని రావిర్యాల గ్రామంలో గురువారం అంతర్గత మురుగు కాలువ పనులను సర్పంచ్ నీలయ్య ప్రారంభించారు. ఈ సంతర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధి కోసం అనేక నిధులు మంజురు చేస్తుందని అన్నారు. గ్రామంలో అంతర్గత మురుగు కాలువలు నిర్మించడం వల్లన గ్రామం ఎంతో శుభ్రంగ ఉంటుందని పెర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సినియర్ నాయకుడు చలివేంద్రంపల్లి రాజు. ఉప సర్పంచ్ జంగయ్య, భాస్కర్ సుధాకర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## సర్పంచుల చైతన్య సదస్సును విజయవంతం చేయాలి

**-టి పి ఆర్ సి రాష్ట్ర కార్యదర్శి మందిపాల్ వెంకట్**

**చౌడాపూర్ ,జూన్ 11 ,ప్రభాతవార్త :**

తెలంగాణ పంచాయితీ రాజ్ ఛాంబర్, వికారాబాద్ జిల్లా సర్పంచుల సంఘం ఆద్వర్యంలో జూన్ 15 వతేదిన నిర్వహించే సదస్సు ను విజయవంతం ఛేయాలని టి.ఆర్.పి.సి. కార్యదర్శి వెంకట్ పిలుపునిచ్చారు. నూతనంగా గ్రామ ప్రజల ఆమోదంతో ఎన్నికైన సర్పంచులు, గ్రామాభివృద్ధిలో చైతన్యవంతులై, ఎన్నికల సమయంలో రోడ్లు, డ్రైనేజీలు, గ్రామ పంచాయతీ భవనాలు, అంగన్వాడీ భవనాలు, కుల సంఘాల భవనాలు, విధ్యాభివృద్ధి , మోలిక సదుపాయాల అభివృద్ధి పై గ్రామాల ప్రజలకు ఇచ్చిన హామీలను సాధించాలనే సంకల్పంతో ముందుకు సాగాలని ఆకాంక్షస్తూ, సర్పంచుల చైతన్య సదస్సు ను జూన్ 15 నాడు, హరిత రిసార్ట్, వికారాబాద్ లో నిర్వహిస్తున్నామని , సదస్సు కు సర్పంచులు హాజరై విజయవంతం చేయాలని మందిపల్ వెంకట్ తెలిపారు.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండి చట్టబద్ధంగా, న్యాయబద్ధంగా రావలిసిన నిధులు, విధులు, అధికారాల కోసం సంఘటితంగా పోరాడి, సాధించుకుందని వెంకట్ తెలిపారు. విజయవంతం చేసి ఇతర ఈ కార్యమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ పంచాయితీ రాజ్ ఛాంబర్ రాష్ట్ర అధ్యక్షులు చింపుల సత్యనారాయణ రెడ్డి , ఉపాధ్యక్షులు ఖమ్మం నరేంద్ర , ప్రధాన కార్యదర్శి బాధేపల్లి సిధ్ధార్థ , మాజీ రాష్ట్ర సర్పంచుల సంఘము అధ్యక్షులు పురుషోత్తం రెడ్డి , మాజీ ఎంపీపీ ల సంఘము రాష్ట్ర అధ్యక్షులు శ్రీశైలం , మాజీ జడ్పీటీసీల సంఘము రాష్ట్ర అధ్యక్షులు బెల్లం శ్రీనన్న , మాజీ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా సర్పంచుల సంఘము అధ్యక్షులు మధుసూదన్ గుప్త , ప్రస్తుత రంగారెడ్డి జిల్లా సర్పంచుల సంఘము అధ్యక్షులు శివారెడ్డి, హారరవుతారని , మాజీ ఎంపీపీలు, జడ్పీటీసీలు, సర్పంచులు, మాజీ ఎంపీటీసీ లు పాల్గొనాలని ఆయన ప్రకటనలో తెలిపారు.

# కాంగ్రెస్ నేత వెంకట్ రాజ్ హఠాన్మరణం

**ఘన నివాళులర్పించిన రాజకీయ, సామాజిక రంగ ప్రముఖులు**

**మేడ్చల్, జూన్ 11, ప్రభాతవార్త :** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కంభం వెంకట్ రాజ్ గురువారం తెల్లవారుజామున నగరంలోని తన నివాసంలో గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. ఆయన మృతితో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, రాజకీయ సహచరులు, శ్రేయోభిలాషులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.

ఆయన భౌతికకాయాన్ని మేడ్చల్ మండల పరిధిలోని పూడూరు గ్రామంలో ఉన్న వారి వ్యవసాయ క్షేత్రానికి తరలించగా, విషయం తెలుసుకున్న రాజకీయ, సామాజిక రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు అక్కడికి చేరుకుని పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. ఈ సందర్భంగా మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ మాట్లాడుతూ, డాక్టర్ కంభం వెంకట్ రాజ్ మరణం తనను తీవ్రంగా కలచివేసిందన్నారు. రాజకీయాలకు అతీతంగా అందరితో ఆప్యాయంగా మెలిగే వ్యక్తిగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉందని పేర్కొన్నారు. ఎవరికి ఏ అవసరం వచ్చినా తన వంతు సహాయం అందించేందుకు ముందుండేవారని, సమాజంలో మంచి మనిషిగా, స్నేహశీలిగా పేరు సంపాదించుకున్నారని అన్నారు. ఆయన చిరునవ్వు, మానవీయ విలువలు, అందరినీ కలుపుకుపోయే స్వభావం ఎప్పటికీ గుర్తుండిపోతాయని చెప్పారు. ఆయన మరణం కుటుంబ సభ్యులకు మాత్రమే కాకుండా మిత్రులకు, శ్రేయోభిలాషులకు, ఆయనను అభిమానించిన ప్రతి ఒక్కరికీ తీరని లోటని పేర్కొన్నారు.

ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ మాట్లాడుతూ, వెంకట్ రాజ్ నిరాడంబర జీవనం గడిపిన వ్యక్తి అని, సమాజ సేవ పట్ల అంకితభావంతో పనిచేశారని కొనియాడారు. ప్రజలతో



పూడూర్ గ్రామంలో వెంకట్‌రాజు భౌతిక గాయానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్

మమేకమై, అందరికీ ఆత్మీయుడిగా నిలిచిన ఆయన అకాల మరణం ముదిరాజ్ సమాజానికి, స్నేహితులకు, శ్రేయోభిలాషులకు తీరని లోటని పేర్కొంటూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

అనంతరం అశ్రునయనాల మధ్య వెంకట్ రాజ్ అంత్యక్రియలు నిర్వహించి తుది వీడ్కోలు పలికారు. ఈ అంతక్రియల్లో శాసన మండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాష్, సీనియర్ నాయకులు చిన్నంగి వెంకటేష్, వేణు గోపాల్ రెడ్డి, పెంటారెడ్డి, సత్యనారాయణ రెడ్డి, రవీందర్ రెడ్డి, పీసరి శ్రీనివాస్ రెడ్డి, దేవేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు బాబు యాదవ్, సుగుణమ్మ, దుద్దు సంజీవరావు, నరేందర్, మాజీ ఎంపీటీసీ, నీరుడి రఘు, బాల మల్లేష్, నాయకులు ఎర్రవల్లి విఘ్నేశ్వర్ రెడ్డి, ఎండీ ఆరిఫ్, వేముల శ్రీనివాస్ రెడ్డి, సద్ది సుదర్శన్ రెడ్డి, మల్లికార్జున్ ముదిరాజ్, కోలా వెంకటేష్, శేఖర్ రెడ్డి, హన్మంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మహా సభ విజయవంతం చేయండి : వ్యకాస అంజయ్య

**యాచారం, జూన్11, ప్రభాతవార్త:**

రంగారెడ్డి జిల్లా షాద్నగర్‌లో జరగబోయే వ్యవసాయ కార్మిక సంఘం 12వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు పెరమండ్ల అంజయ్య, కార్యదర్శి కందుకూరి జగన్ పిలుపునిచ్చారు. గురువారం ఓ ప్రకటన చేస్తూ చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే కుట్ర చేస్తుందన్నారు. ఉపాధి హామీలు కూలీలకు నష్టం కలిగించే విధానాన్ని తొలగించాలన్నారు. ఉపాధి పనుల్లో రెండుసార్లు ఫోటోలు తీయడం విధానాన్ని తక్షణమే తొలగించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వ్యవసాయ కూలీలకు ఇస్తామన్న 12 వేల రూపాయలు ఇవ్వాలని ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు చేయాలని పేదల భూ సమస్యల పరిశీలించాలని డిమాండ్ చేశారు .



వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు అంజయ్య జగన్

## పంచాయతీ సెక్రటరీ సరితకు ఘన వీడ్కోలు

**షాద్‌నగర్, జూన్ 11, ప్రభాతవార్త :** గంట్లవెల్లి గ్రామ పంచాయతీ మాజీ సెక్రటరీ సరిత బదిలీ సందర్భంగా గ్రామంలో వీడ్కోలు సన్మాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. సరిత ఎంతో చిత్తశుద్ధితో ప్రజలకు సేవలు అందించారని, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అలంకరించాలని ఆకాంక్షి ంచారు. అనంతరం ఆమెను ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చక్కటి శివకుమార్ యాదవ్, ఉప సర్పంచ్ మిద్దె మోనిక, గంట్లవెల్లి మాజీ సర్పంచ్ కర్నాలు యాదమ్మ యాదయ్య, మాజీ ఉప సర్పంచ్ మూడవత్ భాస్కర్ నాయక్, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాల నివారణపై ప్రత్యేక అవగాహన

**శంకర్‌వల్లి, జూన్ 11, ప్రభాతవార్త :** ఉన్నతాధికారులు ఆదేశానుసారం మొకిల పోలీస్ స్టేషన్ పరిధిలో ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ ఈగల్ టీమ్ సమక్షంలో మాదక ద్రవ్యాల నివారణపై ప్రత్యేక అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా చిన్నచిన్న వ్యాపార దుకాణాలు మరియు ఇతర ప్రజా ప్రదేశాలను సందర్శించి, మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాల గురించి ప్రజలకు అవగాహన కల్పించబడింది. అలాగే ఫ్యూచర్ సిటీ కమిషనరేట్కు చెందిన నార్కోటిక్స్ డిటెక్షన్ డాగ్ "తేజ", దాని హ్యాండ్లర్ కె. ఆంజనేయులు, ఆర్ఎస్ఐ రాము మరియు మొకిల ఎస్.ఐ సురేష్ గౌడ్ సమక్షంలో అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. అక్రమంగా మాదక ద్రవ్యాల విక్రయం, నిల్వ, రవాణా లేదా వినియోగం గురించి సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని దుకాణదారులు మరియు ప్రజలకు సూచించబడింది.



మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

# ప్రీ-ప్రైమరీ పిఎం శ్రీవిద్య కేంద్రాలను రద్దు చేయాలి

**శామీర్‌పేట, జూన్ 11, ప్రభాతవార్త:**ప్రీ-ప్రైమరీ పిఎం శ్రీవిద్య కేంద్రాలను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని, అంగన్‌వాడీ కేంద్రాలకు అప్పగించాలని శామీర్‌పేట మండల సిఐటియు కార్యదర్శి ఎం.కిష్టప్ప ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం శామీర్‌పేట మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడి టీచర్లు, సిఐటియు నాయకులు ప్రీ ప్రైమరీ సెంటర్లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నా చేశారు. తెలంగాణ అంగన్‌వాడి టీచర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సునీత ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం జరిగింది. శామీర్‌పేట మండల తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రాన్ని వారు అందజేశారు. ఈ సందర్భంగా మండల సిఐటియు కార్యదర్శి ఎం.కిష్టప్ప మాట్లాడుతూ ప్రీ ప్రైమరీ పిఎం శ్రీవిద్య కేంద్రాలను అంగన్‌వాడీలకు అప్పగించాలని, వాటిని ప్రత్యేకంగా నిర్వహించే పద్ధతిని ప్రభుత్వం మానుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం నూతన విద్యా విదానంలో భాగంగా అంగన్‌వాడి కేంద్రాలకు ఎసరు పెట్టటానికి పూనుకుందని విమర్శించారు. అంగన్‌వాడీలకు నష్టం కల్గించే విధంగా ప్రీ ప్రైమరీ కేంద్రాలను ఏర్పాటు చేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీర్మాణం చేసి ఆ కేంద్రాలను అంగన్‌వాడీలకు అప్పగించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలను రాష్ట్ర ప్రభుత్వం పాటించటం దారుణమన్నారు. ఏళ్ల తరబడిగా అంగన్‌వాడీ టీచర్లుగా పనిచేస్తున్నామని, హెల్పర్లు కూడ పనిచేస్తున్నారని, ప్రీ ప్రైమరీ కేంద్రాలు పాఠశాలల్లో ఏర్పాటు చేయటం దారుణమన్నారు. ప్రభుత్వం స్పందించి అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లకు న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు అనిత, భూజాత, లక్ష్మి, వీరమణి, భాగ్య, అరుణ, పాల్గొన్నారు.



## మూడుచింతలపల్లిలో జరిగిన ఉచిత కంటి వైద్య శిబిరం

**శామీర్‌పేట, జూన్ 11, ప్రభాతవార్త:**మూడుచింతలపల్లి మున్సిపల్‌లో ఉచిత కంటి వైద్య శిబిరం జరిగింది. గురువారం మూడుచింతలపల్లి మున్సిపల్ పరిధిలో సరోజినిదేవి కంటి వైద్య హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరంను మున్సిపల్ చైర్మన్ జాము రవి ప్రారంభించారు. గ్రామానికి చెందిన ప్రజలు, వృద్ధులు కంటి పరీక్షలు చేయించుకున్నారు. అవసరమైన వారికి తగిన వైద్యులు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ నీరజ్‌గౌడ్, మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్, మేనేజర్ ఉషా, రెవెన్యూ ఇన్స్పెక్టర్ రాజేశ్వర్‌రెడ్డి, గౌతమి, సీనియర్ అసిస్టెంట్ భాస్కర్, మోహన్‌సింగ్, దేవేందర్, సుభాష్ బిల్‌కలెక్టర్లు, సిబ్బంది, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.



ఉచిత కంటి వైద్య శిబిరం ప్రారంభించి పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ జాము రవి, పాల్గొన్న కౌన్సిలర్, అధికారుల దృశ్యం